ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | గురువారం | 16.07.2026 | సంపుటి : 2 | సంచిక : 15 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు




## తెలంగాణలో సర్ నమోదు పక్రియ

### గడువును ఆగస్ట్ 3 వరకు పొడిగించిన ఎన్నికల సంఘం

**హైదరాబాద్,జూలై15 :** తెలంగాణలో సర్ నమోదు పక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగించింది. సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ, అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని ప్రకటించింది. ఈనెల 24 వరకు ఉన్న ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువును ఆగస్టు 3వ తేదీవరకు పొడిగించింది. అనేక జిల్లాలో సర్‌పై అవగాహన లేక మందకోడిగా కొనసాగుతుండగా గడువు సమీపిస్తుండడంతో అనేక రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఎన్యూమరే షన్ ఫారాల స్వీకరణను పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి పత్రాలు అందించాయి దీంతో స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ గడువు పొడిగిం పును ప్రకటించింది. అర్హత తేదీగా అక్టోబర్ 1వ తేదీ నాటికి ఓటర్ల వివరాల సవరణను పరిగణనలోకి తీసుకుం టూ నూతన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నూతన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు ఇప్పటికే జూన్ 25 నుంచి

మిగతా 2 లో

# ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలకపాత్ర

## 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

### అత్యంత అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం

### అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన

రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెజాన్ డేటా సెంటర్ ఫ్యూచర్ సిటీలో కీలక పాత్ర పోషించనుందని అన్నారు. అత్యంత అధునాతన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఇక్కడ మరిన్ని పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది మా లక్ష్యం. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఐఎస్‌బీ, నల్సార్ సహా అనేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం.



హైదరాబాద్, జూలై 15 : పారిశ్రామిక వేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో ఓఆర్ ఆర్, విమానాశ్రయం, ఫార్మా కంపెనీలు అనేక సేవలు అందిస్తున్నాయి. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారబోతున్నాం. పరిశ్రమలు, టూరిజం, క్రీడా నైపుణ్యం, వైద్య రంగాల్లో పాలసీలు తెచ్చాం. హైదరాబాద్‌లోని 3వేల ఆర్టీసీ బస్సులు, 2లక్షల ఆటోలను ఈవీలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నాం. గొప్ప నగరంగా మారాలనే మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టాం. ఫార్మా పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తీసుకెళ్తున్నాం. హైదరాబాద్‌లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు. పన్నెండేళ్ల వ్యవధిలో అమెజాన్ విస్తరణకు

-మిగతా 2 లో..

## ప్రభుత్వ పాఠశాలల్లోనే భవిష్యత్

స్కూళ్లను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది

ఇక్కడ చదివితేనే మెరుగైన భవిష్యత్

కొత్తకోటలో బాలికల హైస్కూల్ భవనాలకు ప్రారంభం

క్రీడల్లో అయినా రాణించాలని సీఎం రేవంత్ హితవు



02



## మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం

### ఎన్డీఎస్ఏ రిపోర్టుపై కేటీఆర్ మండిపాటు

పోలవరం విషయంలో ఒకలా..ఇక్కడ మరోలా

రాష్ట్ర ఇంజనీర్ల నివేదికను బహిర్గతం చేయాలి

సిసిఐని తెరిపించాలని కేంద్ర మంత్రికి వినతి

గతంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే.. ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదు. మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని కేంద్రం తీరుపై కెటిఆర్ మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్డీఏ అన్నారు. ఢిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ విమర్శలు చేశారు.

న్యూఢిల్లీ, జూలై 15 : తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి 30 శాతం వసూళ్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు. కాళేశ్వరంపై ఆయన పగబట్టి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను బయటపెట్టాలని కెటిఆర్ ఢిల్లీలో మీడియాతో అన్నారు. గత రెండేళ్లలో కేసీఆర్ ఏ ఒక్కరి పేరు పెట్టి విమర్శలు చేయలేదు. రేవంత్‌కు మాత్రం.. కేసీఆర్ పేరు తలవని రోజు లేదు. రెండు రోజులు ఢిల్లీలోనే ఉన్న సీఎం.. ఎన్డీఎస్ఏ అధికారులను ఎందుకు కలవలేదన్నారు. ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికకు.. తుది నివేదికకు చాలా వ్యత్యాసం ఉంది. మేడిగడ్డపై చూపిన శ్రద్ధ.. మిగతా రాష్ట్రాలపై ఎందుకు చూపలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ పని తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం

-మిగతా 2 లో..

# సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు

### కేంద్రంతో నిరంతర సంప్రదింపులు

### ఉమ్మడి జిల్లాకు గోదావరి జలాల తరలింపు

### ప్రధాన అంశాలపై మంత్రి ఉత్తమ్‌తో తుమ్మల చర్చ



అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వీలైనంత త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీతారామ ఎత్తిపోతల పథకంతోపాటు సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన సమస్యలను మంత్రి ఉత్తమ్ దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. రేపు మంత్రి ఉత్తమ్ ప్రాజెక్ట్ సందర్శన వెళ్తున్న నేపథ్యంలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్, జూలై 15 : పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్అండ్‌సీసీ) అనుసరిస్తున్న ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌వోపీ)కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండటంతో మార్చి 2023 నుంచి ప్రాజెక్టు పనులు నిలిచిపోయిన సంగతిని మంత్రి తుమ్మల గుర్తుచేశారు. ఈ న్యాయపరమైన చిక్కులు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా, పర్యావరణ అనుమతులు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ కృషి చేస్తోందని వివరించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో సమన్వయంతో పనిచేస్తూ, కేంద్ర మంత్రులు, శాఖలు,

-మిగతా 2 లో..



## సమర్థవంతంగా పోక్సో చట్టం అమలు చేయాలి

### షాబాద్ ఘటనలో బెయిల్ రావడం పోలీసుల వైఫల్యం

### పోక్సో కేసుల్లో కఠినంగా వ్యవహరిస్తే మంచిది

### సిఎం రేవంత్‌కు పవన్ కళ్యాణ్ లేఖ

హైదరాబాద్, జూలై 15 : పోక్సోచట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు చిన్నారులపై లైంగిక నేరాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తెలంగాణ

-మిగతా 2 లో..

# అమృత్ భారత్ కింద రైల్వే స్టేషన్ల ఆధునీకరణ

### రూ.26 కోట్లతో హై-టెక్ సిటీ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ

### దక్షిణ మధ్య రైల్వే అధికారుల వెల్లడి

హైదరాబాద్‌లో రూ. 26 కోట్ల వ్యయంతో పునరుద్ధరించిన హై-టెక్ సిటీ రైల్వే స్టేషన్ భారతీయ రైల్వే' అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద రైలు మౌలిక సదుపాయాలను ఆధునీకరించడం జరిగింది. ప్రయాణీకుల అనుభవాన్ని మెరుగుపరచడం పట్ల తన సంకల్పంలో భాగంగా, దేశవ్యాప్తంగా వివిధ రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధిని చేపట్టింది.



హైదరాబాద్, జూలై 15 : తెలంగాణ రాష్ట్రంలో, 40 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధికి ఎంపిక చేయబడినాయి. వీటిలో, బేగంపేట్, వరంగల్ మరియు కరీంనగర్ అనే మూడు స్టేషన్లను ఇప్పటికే పునరాభివృద్ధి చేయడం ప్రారంభించారు. ఇదే ఉత్సాహంతో, హైదరాబాద్‌లోని హై-టెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో రూ.26 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ స్టేషన్‌ను

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

### టీపీసీసీ చీఫ్ మహేశ కుమార్ గౌడ్ ప్రకటన

హైదరాబాద్, జులై 15 : ఈనెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్ లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి

-మిగతా 2 లో..



# హైదరాబాద్‌లో ఐటీ ఎగుమతులు ధమాల్

దిగజారుతున్న హైదరాబాద్ ప్రభ

గోదావరి జలాలు లిఫ్ చేయకుండా బాబుకు దాసోహం

మండిపడ్డ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



03

# సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బోనాలు పండుగ

- తెలంగాణ ఆత్మను ఆవిష్కరించే మహోత్సవం 'ఆషాఢ బోనాలు
- బోనాల పండువగా నిర్వహించేందుకు రూ. 20 కోట్లు కేటాయింపు
- 16న గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనం
- మంత్రి కొండా సురేఖ



03

# అమృత్ భారత్ కింద రైల్వే స్టేషన్ల ఆధునీకరణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై 17న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి,'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో జరిగిన రూపాంతరాన్ని ప్రదర్శించడానికి మరియు పునరాభివృద్ధి ప్రాజెక్ట్ ముఖ్యవిశిష్టతలు మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇన్‌ఫ్రా) కె. ముత్యాల నాయుడు, దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. శివ హర్ష,సికింద్రాబాద్ డివిజన్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (గతి శక్తి) శ్రీ ఆర్. మల్లికార్జున, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కో-ఆర్డినేషన్) శ్రీ ఎస్.వరుణ్ బాబు మరియు ఇతర ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు. సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శ్రీధర్ మీడియా ప్రతినిధులకు ముఖ్యమైన వివరాలు తెలియజేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద భారతదేశవ్యాప్తంగా 1300కు పైగా రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనిలో భాగంగా, తెలంగాణ రాష్ట్రంలో రూ. 2000 కోట్లకు పైగా వ్యయంతో 40 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.హైదరాబాద్ నగర పశ్చిమ కారిడార్‌లో ఉన్న హై-టెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను రూ.26 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చేసినట్లు సీపీఆర్ఓ తెలియజేశారు. ఈ స్టేషన్‌లో ప్రస్తుతం 12 మీటర్ల వెడల్పు గల పాదచారుల వంతెన, అదనపు లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్రయాణీకులకు అనుకూలమైన సూచికలు, మెరుగైన స్టేషన్ ముఖభాగం, కొత్త పోర్టికో వంటి ఆధునిక సౌకర్యాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రయాణికులకు గానీ, రైలు సేవలకు గానీ ఎలాంటి పెద్ద అసౌకర్యం కలగకుండా ఉండేందుకు పునరాభివృద్ధి పనులు దశలవారీగా చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి భారతీయ రైల్వేల దూరదృష్టికి ప్రతీకగా నిలుస్తూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశ ఆర్థిక కేంద్రాలకు ప్రపంచ స్థాయి పట్టణ రవాణా మౌలిక సదుపాయాలను అందించాలనే సంకల్పానికి మరో మైలురాయిగా నిలిచింది. విశాలమైన ప్రయాణికుల ప్రాంగణాలు, విమానాశ్రయ స్థాయిలో ఆధునిక సౌకర్యాలు, సమకాలీన శిల్పకళ వైభవం, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన స్మార్ట్ ప్రణాళికతో ఈ స్టేషన్ సరికొత్త రూపును సంతరించుకుని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ ఐటీ కారిడార్ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రయాణికులకు అత్యున్నత ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది.దేశంలోని అగ్రశ్రేణి సాంకేతిక మరియు ఆవిష్కరణకేంద్రాలలో ఒకటిగా వ్యాపారాలు, నిపుణులు, విద్యార్థులు మరియు ప్రపంచవ్యాప్త ప్రతిభావంతులను ఆకర్షిస్తూ ఉన్నందున, ఈ స్టేషన్ యొక్క ఆధునిక మౌలిక సదుపాయాలు సుస్థిర పట్టణ రవాణాకు మరియు నిరాటంకమైన బహుళ రవాణా అనుసంధానానికి మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రూపాంతరం చెందిన ఈ రైల్వే స్టేషన్ కేవలం ఒక రవాణా కేంద్రం మాత్రమే కాదు; భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్నవికసిత భారతానికి ప్రతిబింబం. ఆవిష్కరణలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అత్యాధునికంగా తీర్చిదిద్దుతూ, ప్రపంచ ఐటీ గమ్యస్థానంగా హైదరాబాద్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రయాణికులకు మరింతస్మార్ట్, సురక్షితమైన, ప్రపంచ స్థాయి వాస్తవ రైలు ప్రయాణ అనుభవాన్నిఅందించేలా ఈ స్టేషన్ రూపుదిద్దుకుందన్నారు.

# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

(మొదటిపేజీ తరువాయి)

నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్ ÷నైల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరి తో మాట్లాడానని మహేశ్ తెలిపారు. 'తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు' అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానిక గా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పని తీరు బాగుందని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు

(మొదటిపేజీ తరువాయి)

అధికారుల వద్ద అన్ని విధాలుగా ప్రయత్నాలు కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అనుమతులు లభించిన వెంటనే పనులు పునఃప్రారంభమై, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతాంగానికి సాగునీటి ప్రయోజనాలు త్వరితగతిన అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానిక రైతాంగానికి పెద్దఎత్తున ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో పంప్‌హౌస్-1, పంప్‌హౌస్-2 మధ్య దోమలవాగుపై ప్రస్తుతం ఉన్న 0.20 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.50 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో చర్చించినట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నిల్వ సామర్థ్యం పెరిగితే ఎత్తిపోతల పథకం మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని, రెండు పంప్‌హౌస్‌ల మధ్య నీటి లభ్యత స్థిరంగా ఉంటుందని మంత్రి వివరించారు. ఈ ప్రతిపాదనకు నీటిపారుదల శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని, కార్యరూపంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని మంత్రి తుమ్మల వెల్లడించారు. సీతారామ ప్రధాన కాలువపై పంప్‌హౌస్-1, 2, 3 మధ్య అవసరమైన చోట్ల ఎస్కేప్ రెగ్యులేటర్ల ఏర్పాటు అంశంపైనా విస్తృతంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. వర్షాకాలంలో అధిక వరద ప్రవాహం ఏర్పడినప్పుడు కాలువకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు, నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు ఈ రెగ్యులేటర్లు ఎంతో దోహదపడతాయని వివరించారు. కాలువ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయడం, అధిక ప్రవాహాన్ని నియంత్రించడం లక్ష్యంగా అవసరమైన సాంకేతిక పరిశీలనలు చేపట్టాలని అధికారులను ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించినట్లు వివరించారు. సత్తుపల్లి ట్రంక్ కాలువలోని యాతలకుంట సొరంగం తవ్వకం పూర్తయిందని, ప్రస్తుతం లైనింగ్ పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2026 ఆగస్టు నాటికి లైనింగ్ పూర్తి చేసి నీటి విడుదలకు సిద్ధం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సొరంగం పూర్తయితే సత్తుపల్లి ప్రాంత రైతాంగానికి సాగునీటి లభ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సొరంగం నిర్మాణ బిల్లుల చెల్లింపులను త్వరగా విడుదల చేస్తామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగితే నిర్మాణ సంస్థలు మరింత వేగంగా పనులు కొనసాగించే వీలుంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పరిహార చెల్లింపులను తక్షణమే విడుదల చేయాలని మంత్రి కోరగా, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. భూసేకరణ పరిహారం అందితే బాధిత రైతులకు ఊరట లభించడంతోపాటు ప్రాజెక్టు పనులు కూడా ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందుకు సాగుతాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లో అత్యధిక భూములు ఆయిల్‌పామ్ సాగులో ఉన్నందున, సంప్రదాయ డిస్ట్రిబ్యూటరీ కాలువలకు బదులు పైపుల ద్వారా సాగునీటి పంపిణీసాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ఆయిల్‌పామ్ తోటలకు నిరంతరం, నియంత్రిత పద్ధతిలో నీరు అందించేందుకు పైప్డ్ ఇరిగేషన్ విధానం మరింత అనుకూలంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై సమగ్ర ప్రతిపాదనలు అత్యవసరంగా సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సీతారామ ప్రధాన కాలువపై జూలూరుపాడు సొరంగం నిర్మాణం వివిధ కారణాలతో నిలిచిపోయిన విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలకపాత్ర

(మొదటిపేజీ తరువాయి)

రూ.60వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఆ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పరస్పర అంగీకారం కుదుర్చుకుంది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్ విస్తరణ కోసం 202 ఎకరాలు, చందన్‌వెల్లిలో 98 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.125 కోట్ల విలువ చేసే ప్రోత్సాహకాలు, రాయితీలు అమెజాన్‌కు అందించింది. తొలి విడతలో భాగంగా.. 24 నెలల్లో నిర్మాణ సంబంధిత పనులు పూర్తవుతాయి. అనంతరం రాబోయే 10 ఏళ్లలో మిగతా పనులు పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లో క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, డిజిటల్ బ్యాంకింగ్, ఈ-కామర్స్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన డిజిటల్ మౌలిక వసతులు మరింత బలోపేతం కావడంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి




ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం జరగనుంది.12 ఏళ్లలో రూ.60వేల కోట్లను అమెజాన్ వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే భవిష్యత్

- స్కూళ్లను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది
- ఇక్కడ చదివితేనే మెరుగైన భవిష్యత్
- కొత్తకోటలో బాలికల హైస్కూల్ భవనాలకు ప్రారంభం
- క్రీడల్లో అయినా రాణించాలని సిఎం రేవంత్ హితవు

**మహబూబ్‌నగర్, జూలై 15 :** గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు చేరలేదని.. ఎక్కువ మంది ప్రైవేటుకు వెళ్లారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి సారించామని రేవంత్ చెప్పారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల హైస్కూల్ భవనాలను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఒక్కో విద్యార్థినిపై రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.1.08లక్షలు ఖర్చు చేస్తోంది. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలి. చదువుల్లో రాణించక పోతే క్రీడల్లో రాణించాలి. క్రీడాకారులు మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలోని మాణిక్యాలను వెలికితీయాలి. విద్యార్థులు మైదానాల్లోనూ పోటీపడాలి. మీ భవిష్యత్తుకు నాదీ హామీ. క్రీడల్లో రాణించేవారిని ఉన్నతస్థాయిలో నిలిపే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. ఈ ప్రాంతంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతాం అని రేవంత్ అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివితే



ముఖ్యమంత్రి అవ్వచ్చని... అందుకు తానే ఉదాహరణ అని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ స్కూళ్ళు కీలక పాత్ర పోషించాయని... చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు సీఎం రేవంత్. మొన్న గోల్డ్ మెడల్ సాధించిన ఈషా సింగ్ కు రూ.3 కోట్లు ఇచ్చామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని అన్నారు. 26వేల ప్రభుత్వ స్కూళ్లలో 18 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని..ప్రైవేట్ లో 11 వేల స్కూళ్ళు ఉంటే...33 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు సీఎం రేవంత్. ప్రభుత్వ స్కూళ్ల టీచర్ల అర్హతతో సగం కూడా ప్రైవేట్ టీచర్లకు లేదని.. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు లేక జనం ప్రైవేట్ బాట పడుతున్నారని అన్నారు సీఎం రేవంత్. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూళ్ళు పునరుద్ధరిస్తున్నామని... ప్రభుత్వ స్కూళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోస్తూ రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ఆ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత.. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వట్లేదన్నారు. సముద్రంలోకి పోయే నీటి వినియోగానికి ఏపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశామని అన్నారు. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷-లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ఎ÷-లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు. సీసీఐ సాధన సమితి చేస్తున్న పోరాటం అభినందనీయం. మేం కూడా దీన్ని మళ్లీ నడపాలని కోరికతోనే ఉన్నామని కేంద్రమంత్రి అన్నారని కేటీఆర్



వెల్లడించారు. దాదాపు 230 ఎకరాలు అక్కడ ల్యాండ్ ఉన్నది. ఒక 770 ఎకరాలు ప్రైవేట్ పట్టా ల్యాండ్ కంపెనీకి ఉంది. అట్లాగే 1500పై చిలుకు ఎకరాలు లీజ్ ల్యాండ్ ఉంది. మరి 2 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్త ఫ్యాక్టరీతో పెడితే బాగుంటదన్నారు. ఏమైంది ఎందుకు తెరవలేకపోతున్నరని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం కొంత స్పందించడం లేదు.. సంవత్సర కాలంగా మేం ప్రయత్నం చేస్తున్నం. కానీ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ పొడిగించాలి. వాళ్లు ముందుకు రావడం లేదు. మరి రాష్ట్ర ప్రభుత్వం ఏం సబ్సిడీ ఇస్తదా.. ఏమన్నా పెట్టుబడి పెడ్తతా..? జీఎస్టీ మినహాయింపు ఇస్తదా? చెప్పమంటే చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది నుంచి పెద్దగా స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారని కేటీఆర్ వివరించారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రికి సీసీఐ సాధన సమితి తరపున ధన్యవాదాలుతెలియజేస్తూ.. మేం అధికారంలో ఉన్నప్పుడు సిర్పూర్ పేపర్ మిల్లు తెరిపించాం. అదే ఆదిలాబాద్‌జిల్లాలో మళ్లీ వెంబడ పడి తిరిగి తెరిపించి ఇవాళ వేలాది మందికిఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినం. సీసీఐని పునరుద్ధరిస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారు. సీసీఐని పునరుద్ధరిస్తే వేలాదిమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

# తుంగతుర్తి వ్యవహారంలో వేలు పెట్టను

## జగ్గారెడ్డితో మంత్రి కోమటిరెడ్డి భేటీ

**హైదరాబాద్,జూలై15 :** తుంగతుర్తిలో నెలకొన్న వివాదాన్ని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చూసుకుంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో తాను జోక్యం చేసుకోబోనని స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని కోమటిరెడ్డి నివాసంలో ఆయనతో జగ్గారెడ్డి భేటీ అయ్యారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవుల విషయంలో నెలకొన్న వివాదంపై చర్చించారు. కోమటిరెడ్డితో భేటీ అనంతరం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. తుంగతుర్తి అంశంలో కలగజేసుకునేందుకు కోమటిరెడ్డి ఆసక్తి చూపించడం లేదన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావాలంటే వరుసగా మూడేళ్లు పార్టీ కార్యకర్తగా కొనసాగాలనే ఏఐసీసీ నిబంధన ఉందన్నారు. తుంగతుర్తిలో మూడు, నాలుగు మండలాల్లో ఆ నిబంధనల ప్రకారం నియామకాలు జరగలేదన్నారు. ఈ వ్యవహారంపై ఈనెల 20లోపు నివేదిక ఇస్తానని తెలిపారు. ఇకపోతే చ్చే ఎన్నికల్లో తమ టా÷-గ్గ÷ట్ 120 సీట్లని... దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ స్వీప్ చేస్తామని అన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. బుధవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి కోమటిరెడ్డి. కొంతమంది మంత్రి పదవి కోసం ఢిల్లీకి వెళ్లారని... తాను మంత్రి పదవి కోసం ఢిల్లీకి వెళ్లలేదని అన్నారు మంత్రి కోమటిరెడ్డి. తుంగతుర్తి విషయం అన్ని తెలిసిన వ్యక్తి జగ్గారెడ్డి చూసుకుంటారని.. లోకల్ ఎమ్మెల్యే అందరితో సమన్వయం చేసుకుంటాడని అన్నారు. .రోడ్ల మీదకు వచ్చి కొట్టుకోవద్దని... సమస్యలు ఉంటే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ దృష్టికి తేవాలని అన్నారు కోమటిరెడ్డి. 35ఏండ్ల నుండి ప్రజా జీవితంలో ఉన్నానని... 13వేల కోట్ల నిధులు,7వేల కోట్ల పంచాయితీ రాజ్ రోడ్లకు నిధులు తీసుకొచ్చానని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ లో రోడ్లు వేస్తున్నామని... గడ్కరీతో మాట్లాడి 2వేల కోట్ల సీఆర్ఎఫ్ ఫండ్స్ తెచ్చానని అన్నారు కోమటిరెడ్డి. జగ్గారెడ్డి రెడ్డి ని రాహుల్ గాంధీ ఇష్టపడతారని.. జగ్గారెడ్డి పేదల మనిషి,మాస్ లీడర్ అని... అందరికి సాయం చేస్తారని కొనియాడారు. సిద్దిపేట లో జగ్గారెడ్డి పోటీ చేస్తే పూర్తిగా తమ మద్దతు ఉంటుందని అన్నారు.

# తెలంగాణలో సర్ నమోదు పక్రియ

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించిన ఇంటింటి సర్వే ప్రక్రియ ఆగస్టు 3 వరకు కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పనులను సైతం అధికారులు ఆగస్టు 3 నాటికి పూర్తి చేస్తారు. ఆ తర్వాత ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితా అధికారికంగా విడుదల కానుంది. ముసాయిదా జాబితా విడుదలైన అనంతరం, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు , తప్పుల మార్పులు -చేర్పులకు సంబంధించిన అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం నెల రోజుల పాటు గడువునిచ్చింది. ప్రజలు ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు తమ దరఖాస్తులను సమర్పించే అవకాశం కల్పించారు. ప్రజల నుంచి వచ్చే ఈ అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు సంబంధించిన నోటీసుల జారీ, వాటి పూర్తి స్థాయి పరిష్కార ప్రక్రియను అధికారులు ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ అంతా ముగిసిన తర్వాత అన్ని సవరణలతో కూడిన తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా ప్రకటించనున్నారు.

# సమర్థవంతంగా పోక్సో చట్టం అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. బాధితులకు వేగవంతమైన న్యాయం అందించేందుకు పలు కీలక ప్రతిపాదనలను ఆయన లేఖలో పొందుపరిచారు. తెలంగాణలో జరిగిన షాబాద్ ఘటనను ఉదాహరణగా ప్రస్తావించిన పవన్, బెయిల్‌పై విడుదలైన నిందితుడు ఆరుగురిని హత్య చేసిన సంఘటన తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. పోక్సో కేసుల్లో నిందితుల బెయిల్‌ను మరింత కఠినంగా పరిశీలించాలని, బాధితులు మరియు వారి కుటుంబాలకు పటిష్టమైన భద్రత కల్పించాలని సూచించారు. పోక్సో కేసులను దర్యాప్తు చేసే అధికారులకు తప్పనిసరిగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆయన ప్రతిపాదించారు. బాలలతో సున్నితంగా వ్యవహరించడం, ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాల సేకరణ, కేసుల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ అవసరమని పేర్కొన్నారు. బాధితుల వైద్య పరీక్షలను 24 గంటల్లో పూర్తి చేయాలని, ÷ాంఈఇ కిట్ల వినియోగంతో పాటు ఆెం, ఈ÷ాఒ నివేదికలను వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు పవన్.. ఘటన స్థలాన్ని ఫొటోలు, వీడియోలతో తప్పనిసరిగా నమోదు చేయాలని, పోక్సో కేసుల్లో దర్యాప్తు, ఛార్జిషీట్ గడువులోగా పూర్తి కావాలని పవన్ పేర్కొన్నారు. సాధారణ కేసులను 60 రోజుల్లో, క్లిష్టమైన కేసులను 90 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ కేసులను జిల్లా ఎస్పీలు, రేంజ్ ఐజీలు ప్రతి నెల సమీక్షించాలని సూచించారు. ప్రతి పోక్సో కేసులో బాధితుల రక్షణ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని, అవసరమైతే పోలీసు పహారా, ఎస్కార్ట్ సౌకర్యం కల్పించడంతో పాటు వన్‌స్టాప్ సెంటర్లతో అనుసంధానం చేయాలని పవన్ ప్రతిపాదించారు. బెదిరింపులకు పాల్పడే లేదా నేర చరిత్ర ఉన్న నిందితులపై రౌడీషీట్లు తెరవాలని సూచించారు. పోక్సో కేసుల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (÷ాక్షఖ) విడుదల చేయాలని, జిల్లా, రేంజ్, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక పోక్సో మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసు, ప్రాసిక్యూషన్, మహిళా-శిశు సంక్షేమ శాఖల మధ్య సంయుక్త సమీక్ష సమావేశాలు నిర్వహించాలని కూడా సూచించారు. పోక్సో కేసుల్లో ప్రాథమిక విచారణ పేరుతో ఆలస్యం చేయకుండా వెంటనే ఈఎఫ్ఐ నమోదు చేయాలని, ఈఎఫ్ఐ నమోదు ఆలస్యం చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ లేఖలో పేర్కొన్నారు. అలాగే పాఠశాలలు, హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లు, ప్రార్థనా మందిరాల్లో పిల్లలపై లైంగిక నేరాల నివారణకు తప్పనిసరి రిపోర్టింగ్ వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. పిల్లలపై లైంగిక నేరాలను సాధారణ పరిపాలనా అంశంగా కాకుండా అత్యంత ప్రాధాన్యంతో చూడాలని పవన్ స్పష్టం చేశారు. తాను సూచించిన చర్యల అమలుపై 30 రోజుల్లో కార్యాచరణ నివేదిక అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

జనం వార్త
గురువారం 16 జూలై 2026


# పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ప్రోత్సాహం

- గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నాం
- మా ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదు
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు 9 టిఎంసిల నీటికి యత్నం
- దివిటిపల్లిలో అమరరాజా బ్యాటరీ ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి




**మహబూబ్‌నగర్, జూలై 15 :** తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నామని, అందులో మంచివుంటే మరింత మెరుగ్గా ముందుకు సాగుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మా ప్రభుత్వానికి పాలసీపెరాలసిస్ లేదని అన్నారు. గత ప్రభుత్వాల పాలసీలను మరింత మెరుగుపర్చి ముందుకు తీసుకెళ్తున్నాం అని అన్నారు. 1994 నుంచి 2004వరకు చంద్రబాబు నాయుడు, 2004 నుంచి 2014వరకు వైస్ రాజశేఖర్ రెడ్డి, 2014 నుంచి 2023డిసెంబర్ వరకుగత ప్రభుత్వాలు తీసుకువచ్చిన పాలసీలను మా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. గతప్రభుత్వాల పాలసీల్లో ఉన్న మంచి మేం కూడా ప్రోత్సహిస్తున్నాం.. మహబూబ్ నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మంత్రులు శ్రీధర్ బాబు,జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి,అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్,ప్రభుత్వ విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డి,ఎంపీ లు డీకే అరుణ,మల్లు రవి, ఉమ్మడి జిల్లా ఎంఎల్ఏ లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హాజరయ్యారు. అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ప్లాంట్ ఆవరణలో ముఖ్యమంత్రి మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరరాజా అద్భుతమైన పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేసిందని, 1983 లో అమరరాజా చిత్తూరు జిల్లాలో మొదటిసంస్థను ఏర్పాటు చేసిందన్నారు. అమర రాజా సంస్థ ఏర్పాటు చేసి 40 యేళ్లు అవుతోందన్నారు. అమర రాజా గ్లోబల్ సంస్థ.. అంటూ అమర రాజా కు దేశంలో పోటీ లేదన్నారు. చైనా, జపాన్, జర్మని, కొరియా లాంటి దేశాలనుఆదర్శంగా తీసుకుని అమర రాజా సంస్థ పనిచేస్తోందన్నారు. ప్రపంచంలో చైనా ఈవీవెహికిల్స్ కు లీడర్ గా ఉంది.. ఈవీలో చైనాతో అమర రాజా సంస్థ పోటీ పడిపనిచేస్తోంది.. కాలుష్యం వేగంగా విస్తరిస్తోంది.. వాతావరణంలో మార్పులు వేగంగా వస్తున్నాయి.. ఎలినినో ప్రభావం కారణంగా వర్షాలు పడటం లేదు.. రైతులు ఇబ్బంది పడుతున్నారు.. కోవిడ్ తర్వాత వాతావరణంలోచాలా మార్పులు వచ్చాయని సిఎం అన్నారు. కాలుష్యం తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది.. కాలుష్య నియంత్రలో ఈవీవెహికిల్స్అవసరం ఉంది.. దివిటిపల్లి అమర రాజా యూనిట్ లో 700 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు..ఇందులో 400 మంది మహిళా ఉద్యోగులు ఉండటంమహిళా సాధికారిత కు నిదర్శనం.. తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా పాలసీలుతీసుకువస్తున్నాం.. ప్రస్తుతం దేశ జీడీపీలో5 శాతం తెలంగాణ వాటా గా ఉంది.. కాని నేను దీనిపైన సంతోషంగా లేను.. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం.. 2034 నాటికి తెలంగాణను వన్ట్రిలియన్డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే మా ధ్యేయం అన్నారు. అమర రాజా లాంటి సంస్థలు తెలంగాణ రైజింగ్ కు మద్దతుగా ఉంటున్నాయి.. తెలంగాణనుక్యూర్, ప్యూర్, రేర్ గా విభజించిపాలసీలు రూపొందించి ముందుకు వెళ్తున్నాం.. తెలంగాణ పరిశ్రమలు పెట్టాలంటే మౌలిక సదుపాయాలు ముఖ్యం.. పారదర్శకంగా విధానాలు రూపొందించుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.. ఢిల్లీకి రాజు అయినా తల్లికి బిడ్డ అన్నట్లు గా నేను పాలమూరుబిడ్డను. ఆదర్శవంతంగా జిల్లా గా మహబూబ్నగర్ ను తీర్చిదిద్దుతున్నాం.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీ లు సాధించే దిశగాచర్చలుజరుగుతున్నాయి.. డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీ కేటాయింపుల పై చర్చలుజరుపుతున్నాం.. పరిశ్రమలకు అనుకూల వాతావరణంసృష్టించి జిల్లా లో ఉపాధి అవకాశాలుకల్పిస్తాం.. పాలమూరు జిల్లాలో చాలా మంది రైతులు అమర రాజా కు భూములు ఇచ్చారు.. అత్యధిక ఉద్యోగాలు వాళ్లకుఇవ్వాలని కోరుతున్నట్లు వెల్లడించారు. ఆర్ అండ్ బీ మినిస్టర్ గా గల్లాజయ్ దేవ్ తల్లి గల్లా అరుణ కొడంగల్ లో చాలా రోడ్లు మంజూరు చేశారు.. నేను రెండోసారి గెలవడానికి నాకు అవి ఉపయోగపడ్డాయని రేవంత్ అన్నారు.



## ప్రకృతి పరిరక్షణలో విద్యార్థులు ముందుండాలి

### మిషన్ ప్రకృతి అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి అడ్లూరి

**హైదరాబాద్, జూలై 15 :** భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, పచ్చని పర్యావరణాన్ని అందించాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో ప్రకృతి పరిరక్షణపై అవగాహన, బాధ్యత పెంపొందించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రకృతిని కాపాడే ఉద్యమంలో గురుకుల విద్యార్థులు ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'మిషన్ ప్రకృతి అవార్డుల ప్రదానోత్సవం' కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... ఉత్తమ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థి ప్రకృతి మిత్రులకు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణను అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుందని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని చెరువులు, కుంటలు, జలవనరులను పరిరక్షించి పునరుద్ధరించేందుకు హైడ్రా ద్వారా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆక్రమణలకు గురైన చెరువులను పరిరక్షించడం, వర్షపు నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించడం, నగర పర్యావరణ సమతుల్యతను కాపాడటం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గురుకుల విద్యార్థులు విద్యలోనే కాకుండా పర్యావరణ పరిరక్ష ణలోనూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నారని మంత్రి అభినందించారు. మిషన్ ప్రకృతి వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు.

## మాదాపూర్‌లో ఓ వ్యక్తి దారుణ హత్య

**హైదరాబాద్జులై15 :** నగరంలోని మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కత్తులతో దాడి చేసి మరీ యువకుడిని కొందరు వ్యక్తులు కిరాతకంగా చంపేశారు. మృతుడు వరంగల్ జిల్లా మాదన్నపేట్ మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చిన్నపల్లి భాస్కర్‌గా పోలీసులు గుర్తించారు. కులాంతర ప్రేమ వ్యవహారమే హత్యకు కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యువతిని భాస్కర్ ప్రేమించాడు. అయితే కులం వేరు కావడంతో వారి ప్రేమను అమ్మాయి కుటుంబ సభ్యులు అగింకరించలేదు. మూడు సంవత్సరాల క్రితం అమ్మాయిని వేరే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. పెళ్లి అయినప్పటి నుంచీ అమ్మాయికి భర్తతో తరుచూ గొడవలు జరిగాయి. దీంతో ఆమెకు భర్త విడాకులు ఇచ్చేశాడు. తన కూతురి విడాకులకు కారణం గతంలో ప్రేమించిన భాస్కర్ కారణమని అమ్మాయి తండ్రి రాజు కక్ష పెంచుకున్నాడు. గతంలో భాస్కర్‌ను చంపుతామంటూ అమ్మాయి తండ్రి, కుటుంబసభ్యులు బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీలో భాస్కర్ ఉంటున్న హాస్టల్‌కు ఐదుగురు వ్యక్తులు వచ్చారు. హాస్టల్ నుంచి కిందకు వచ్చిన భాస్కర్‌ను దుండగులు అతికిరాతకంగా కత్తులతో పొడిచి చంపేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అయితే అమ్మాయి కుటుంబసభ్యులే తన తమ్ముడిని హత్య చేశారంటూ భాస్కర్ అన్న మధు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఐటీ ఎగుమతులు ఢమాల్

### దిగజారుతున్న హైదరాబాద్ ప్రభ

### గోదావరి జలాలు లిఫ్ చేయకుండా బాబుకు దాసోహం

### మండిపడ్డ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



**హైదరాబాద్, జూలై 15 :** హైదరాబాద్ అనగానే ఒకప్పుడు చార్మినార్ గుర్తొచ్చేది ..ఇపుడు ఐటీ ,ఫార్మా పరిశ్రమలకు హైదరాబాద్ పేరు గాంచిందని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు. వేగంగా పురోగమిస్తున్న నగరాలలో హైదరాబాద్ ఒకటిగా ఉన్న పరిస్థితి నుంచి రేవంత్ పాలనలో దిగజారే దాకా వెళ్తోందన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. 2014లో 50 వేల కోట్ల రూపాయలు ఉన్న ఐటీ ఎగుమతులను 2023లో 2 లక్షల కోట్లు దాటేలా కేటీఆర్ శ్రమించారు. 3 లక్షల ఐటీ ఉద్యోగాల స్థాయి నుంచి కేటీఆర్ 9 లక్షల ఐటీ ఉద్యోగాల స్థాయికి కేటీఆర్ హైదరాబాద్‌ను మార్చారు.. ఇపుడు అందరూ సిగ్గుపడేలా పరిస్థితి మారింది. రేవంత్ రెడ్డి 18 గంటలు కష్టపడి ఐటీ పరిశ్రమను చంపేసే పని చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ కు కాగ్నిజెంట్ రాం రాం అన్నది.. 15 వేల నుంచి 20 వేల ఉద్యోగాలు కల్పించే కాగ్నిజెంట్ విశాఖకు తరలుతోంది. కాగ్నిజెంట్‌ను రెండు చోట్ల విస్తరించేలా గతంలో రెండు ఎంఓయూలు కుదిరాయి. అయినా కాగ్నిజెంట్ హైదరాబాద్ నుంచి విశాఖకు మారుతోంది. లోకేష్ దగ్గర ఉన్న మంత్ర దండం ఏమిటీ..? రేవంత్ దగ్గర లేనిదేమిటన్నారు. 7 వేల ఐటీ ఉద్యోగాలు తగ్గాయని భట్టి అసెంబ్లీలోనే చెప్పారు. రేవంత్ రెడ్డి ఉద్యోగాలను మింగేస్తున్నారు. కేటీఆర్ సగటున 60 వేల ఉద్యోగాలు పెంచితే రేవంత్ రెడ్డి 6 వేల ఉద్యోగాలు తగ్గిస్తున్నాడు. ఇప్పటికే లక్షా 20 వేల ఉద్యోగాలు కోల్పోయాం. మంత్రి శ్రీధర్ బాబు పరిస్థితి కుడిదిలో పడ్డ ఎలుకలా తయారైంది.. మాట్లాడితే మంత్రి పదవి పోతుంది అనే భయం ఉందన్నారు. ఐటీ మీద ఆధార పడుతున్న వారి పరిస్థితి ఏమిటీ..? దావోస్ పోయి పెద్దపెద్ద మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి తెచ్చిన పెట్టుబడులపై శ్వేత పత్రం ప్రకటించాలని దాసోజ్ శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. దుర్గం చెరువు దగ్గర నిర్మాణ వ్యర్థాల కుప్ప పెద్దది అవుతోంది. మరో జవహర్ నగర్ డంప్ యార్డ్ తయారవుతోంది. కేటీఆర్ హయాంలో టీఎస్ఐ పాస్‌తో 18 లక్షలకుపైగా ఉద్యోగాలు ప్రైవేటు రంగంలో వచ్చాయి. కాళేశ్వరం నీళ్లు ఆంధ్రాకే.. ఐటీ పరిశ్రమలు ఆంధ్రకేనా..? రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రా ?ఆంధ్రాకు ముఖ్యమంత్రా ? లేక ఏపీ సీఎం చప్రాసా అంటూ ప్రశ్నలు కురిపించారు. జాబ్ క్యాలెండర్ ఏమైంది..? నిరుద్యోగులు ఉద్యోగాలు అడిగితే గొడ్లను బాదినట్టు బాదుతున్నారు.. కాళేశ్వరంతో నీళ్లు ఇయ్యమంటే రక్తం కావాలంటాడు..గోదావరి జలాలు లిఫ్ట్ చేస్తే కేసీఆర్ కు పేరు వస్తుందని రేవంత్ భయపడుతున్నాడని మండిపడ్డారు.



## ఎమ్మెల్యేను నిర్బంధించడం దారుణం

### ఇదేనా ప్రజాప్రభుత్వం అంటూ హరీష్ రావు ఫైర్

**హైదరాబాద్, జూలై 15 :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని పోలీసులు నిర్బంధించడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తెలిపారు. భీంగల్ మున్సిపాలిటీ అభివృద్ధి, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, ఆర్టీసీ డిపో పునరుద్ధరణ వంటి ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ శాంతియుతంగా నిరాహార దీక్ష చేపట్టాలని ప్రశాంత్ రెడ్డి నిర్ణయించుకుంటే? ఆయనను పోలీసులు నిర్బంధించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. తమది 'ప్రజా ప్రభుత్వం' అని చెప్పుకుంటూ ప్రతిపక్షాన్ని నిర్బంధించడం, పోలీసు రాజ్యాన్ని నడపడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. హిట్లర్ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అధికార అహంకారంతో వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష గొంతులపై అణిచివేత చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

## అమెరికాలో హత్యకు గురైన తెలంగాణ యువకుడి కేసు

### 14 ఏళ్ల బాలుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, జూలై 15 :** అమెరికాలో హత్యకు గురైన తెలంగాణకు చెందిన యువకుడు కుంచ అన్షుల్ కేసులో 14 ఏళ్ల బాలుడిని అగ్రరాజ్య పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. ఫిలడెల్ఫియాకు చెందిన నిందితుడిని హత్య, దొంగతనం అభియోగాలపై జులై 10న అరెస్ట్ చేసినట్లు పోలీసులు తాజాగా వెల్లడించారు. అయితే, ఘటన సమయంలో ఆ బాలుడితో ఉన్న మరో వ్యక్తి ఎవరన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదని తెలిపారు. ఆ వ్యక్తి కోసం గాలింపు చేపట్టామని, ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. నార్త్ ఫిలడెల్ఫియాలో జూన్ 5న అన్షుల్ హత్యకు గురయ్యాడు. ఎడ్గ్లీ స్ట్రీట్‌లో నిర్మానుష్యంగా ఉన్న ఓ ఇంటికి పిజ్జాలు డెలివరీ ఇచ్చేందుకు వెళ్లిన అతడిపై దుండగులు దాడి చేశారు. తుపాకీతో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అన్షుల్‌ను ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. చోరీ కోసమే దుండగులు దాడి చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఉద్దేశపూర్వకంగానే పిజ్జాలు ఆర్డర్ చేసి కాల్పులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లికి చెందిన అన్షుల్.. 2023లో అమెరికా వెళ్లాడు. కేడబ్ల్యూసీ సంస్థలో ఉద్యోగం చేస్తూ.. అదనపు ఆదాయం కోసం వారాంతాల్లో పిజ్జా డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడని కుటుంబసభ్యులు తెలిపారు.

## సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బోనాలు పండుగ

- తెలంగాణ ఆత్మను ఆవిష్కరించే మహోత్సవం 'ఆషాడ బోనాలు
- బోనాల పండువగా నిర్వహించేందుకు రూ. 20 కోట్లు కేటాయింపు
- 16న గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనం
- రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్,జూలై15 :** తెలంగాణ ఆత్మను, సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే ఆషాడ బోనాల ఉత్సవాలు తెలంగాణకు ప్రత్యేకమైన శక్తి ఆరాధనా పండుగ అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అన్నారు. ఆషాడ బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగ కేవలం ఒక ఉత్సవం కాదు, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక మహోత్సవం అని మంత్రి సురేఖ అన్నారు. జూలై 16 నుంచి ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న సుమారు 3వేలకు పైగా దేవాలయాల్లో అట్టహాసంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని మంత్రి సురేఖ తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా-జమున సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని, లౌకిక స్ఫూర్తిని చాటుతాయని మంత్రి పేర్కొన్నారు. ఆషాఢ బోనాల ఉత్సవాలు గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో ప్రారంభమై, ఆగష్టు 13 న హరిబౌలిలోని అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయంలోని అమ్మవారికి బోనాల సమర్పణ అనంతరం ఘటాల నిమజ్జనంతో ముగుస్తాయని మంత్రి సురేఖ తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు బోనాల ఉత్సవాల్లో పాల్గొనే పరిస్థితుల నేపథ్యంలో, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు ఈ యేడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయించడం పై మంత్రి సురేఖ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవార్ల దయతో ఈ యేడాది వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి, సమృద్ధిగా పంటలు పండేలా పరిస్థితులు నెలకొనాలని మంత్రి ఆకాంక్షించారు. భక్తులు సంతోషంగా అమ్మవార్లను దర్శించుకుని, బోనాలు సమర్పించి, తిరిగి సంతోషంగా ఇండ్లకు చేరుకునేలా అన్ని శాఖలు ఏర్పాట్లను పూర్తిచేసినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## బోనాల జాతరలో హస్తకళా మేళా

### 16 నుంచి హైదరాబాద్ హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో ప్రదర్శన

**హైదరాబాద్,జూలై15 :** ఆషాఢమాస బోనాల మహోత్సవాల సందర్భంగా ఈనెల 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ , కమిషనర్ బాల మాయాదేవి తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన అన్ని రకాల చేతివృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ,వాకిటి శ్రీహరి , బీసీ సంక్షేమ శాఖ సలహాదారు వి.హెచ్. హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.గత ఏడాది 30 స్టాల్స్ ఏర్పాటు చేయగా, ఈ ఏడాది 60 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేతివృత్తులు కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, మేదరి, చేనేత , పూసల తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశాన్ని ఈ మేళా కల్పిస్తుందని ఆమె వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఈ మేళాను సందర్శించి సంప్రదాయ చేతివృత్తులను ఆదరించి మేళాను విజయవంతం చేయాలని కోరారు.

## విద్యాసంస్థల్లో డ్రగ్స్ నిరోధానికి కఠిన చర్యలు

### జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాల్సిందే

### ఈగిల్ అధికారులకు డిజిపి ఆనంద్ సూచన

హైదరాబాద్,జూలై15 : విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని ఈగల్ విభాగంలోని అధికారులకు తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. డ్రగ్స్ నిరోధించడంపై బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఈగల్ అధికారులతో సి.వి. ఆనంద్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో 'యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీలు' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి విద్యాసంస్థలో క్యాంపస్ సేఫ్టీ కో ఆర్డినేటర్ నియామకం తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని.. అవసరమైతే గుర్తింపును రద్దు చేసేందుకు సిఫార్సు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతతోపాటు డ్రగ్స్ నివారణ చర్యలపై సేఫ్టీ కమిటీలు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీసు, విద్య, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశించారు. విద్యార్థులకు సైకాలజిస్టులు, కౌన్సెలర్ల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. అలాగే తల్లిదండ్రుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. ÷రిలిలీసు, విద్య, ఆరోగ్య శాఖల సమన్వయంతో డ్రగ్స్ రహిత తెలంగాణెళి లక్ష్యమని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు.

## నగరంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు

### నకిలీ నంబర్ ప్లేట్లున్న వాహనాల సీజ్

**హైదరాబాద్, జూలై 15 :** నకిలీ వాహన నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత వారం రోజుల వ్యవధిలో నకిలీ నంబర్ ప్లేట్లు ఉపయోగించిన వారిపై ఐదు క్రిమినల్ కేసులను పోలీసులు నమోదు చేశారు. జూబ్లీహిల్స్, మలక్‌పేట్, బేగంబజార్, అబిడ్స్, కాచిగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కేసులు నమోదయ్యాయి. ఈ ప్రత్యేక తనిఖీల్లో పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. నకిలీ నంబర్ ప్లేట్లపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా పోలీసులు వెల్లడించారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసుతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనాలపై తప్పనిసరిగా హెచ్ఎస్ఆర్పీ ఉండాలని వారు స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలను మరింత కఠినతరం చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు పోలీసులు స్పష్టం చేశారు.

## 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

### బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు వెల్లడి



**హైదరాబాద్,జూలై15 :** వరంగల్ ఎయిర్‌పోర్టును 2028 నాటికి పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందోన్నారు. అయితే ఆ క్రెడిట్ తీసుకునేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 2011లో రైట్స్ కంపెనీ దేశంలో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు సాధ్యాసాధ్యాలపై చేసిన అధ్యయనంలో వరంగల్, కడప పేర్లు ఉన్నాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక ఉడాన్ స్కీంతో ఎయిర్ పోర్టుల పెంపునకు శ్రీకారం చుట్టింది. కొత్తగా 88 ఎయిర్‌పోర్టులకు ఆమోదం తెలిపింది. అందులో వరంగల్ కూడా ఉంది. భూసేకరణ పూర్తికాకపోవడం వల్లే ఎయిర్ పోర్టు నిర్మాణం ఇంత ఆలస్యమైంది. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు వస్తోందంటే దానికి కారణం మోదీ. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు రాబోతోందని రామచందర్‌రావు చెప్పారు.

# నదుల అనుసంధానమే పరిష్కారం



**ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు వెనక్కి పోయాయి. ఇప్పట్లో వానలు పడతాయన్న భరోసా లేదు. ఈ క్రమంలో తాగు, సాగునీటి సమస్యలతో పాటు ఆహార పదార్థాల లభ్యతపైనా ఆందోళన కలుగుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ చర్యలపై కేంద్రం నిర్ణయాలు తీసుకోవాలి. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సమావేశాల్లో ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయాలపై చర్చించాలి. సాగు,తాగునీటికి శాశ్వత ప్రణాళికలపై చర్చించాలి. కేవలం రాజకీయ ఎజెండాలతో ముందుకు సాగకుండా, వాటిని పక్కన పెట్టి ప్రజల కోసం నేతలు ఆలోచన చేయాలి. నదుల అనుసంధానం ఇందులో ప్రధానమైన సమస్య.**

మనదేశంలో ఎన్నో జీవనదులు ఉన్నాయి. వీటిని సన్మార్గం పట్టిస్తే దేశంలో కరువు కాటకాలకు వీలుండదు. నదులను అనుసంధానించడం, జలరక్షణనను జాతీయ విధానంగా తీసుకోవడం తక్షణావసరంగా గుర్తించాలి. రాష్ట్రాల మధ్య తగవులు తీరాలంటే ఇదే మంచి పద్దతి. నదుల్లో నీరు సముద్రంలోకి వృధాగా పోకుండా మళ్లింపు చర్యలు తీసుకోవాలి. దీనికి నదుల అనుసందానం చేయాలి. అలాగే నీటి సంరక్షణను కేంద్రం ఆధీనంలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల అవసరాలను నెరవేర్చగలగాలి. ఇది చాలా ప్రధానమైన సమస్య. ఈ వర్షాకాల సమావేశంలో పార్లమెంట్ దీనిపై ఎన్నిరోజులైనా చర్చించాలి. అలాగే సమగ్ర ప్రణాళికలు సిద్దం చేయాలి. ఎన్నివేల కోట్లు అయినా నిధులు కేటాయించాలి. అప్పుడే దేశం ఎల్‌నినో లాంటి పరిస్థితులు వచ్చినా తట్టుకుంటుంది. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేం కనుక, దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళిక, శాస్త్రీయ దృష్టి, సమర్థమైన ప్రభుత్వ విధానాలు, రైతులకు సకాలంలో మద్దతు అత్యవసరం. లేకపోతే వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు.. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాల్‌గా గుర్తించాలి.

ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వరుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వర్తమాన వాస్తవం.

ఒకప్పుడు ఋతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురు తున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవు తుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, సాగు పద్ధతులు మార్చుకోవాలి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవుపేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులంద రికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండల స్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది. వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి.

# తుదిదశకు అహ్మదాబాద్ విమాన దుర్ఘటన దర్యాప్తు

## కేంద్ర పౌర విమానమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ, జూలై 15 :** అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు చేరిందని కేంద్ర పౌర విమానమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. అతి త్వరలోనే ఈ ప్రమాదానికి సంబంధించిన తుది నివేదిక వస్తోందని పేర్కొన్నారు. త్వరగా నివేదిక ఇవ్వడం కంటే.. ప్రమాదం అసలు నిజాన్ని బయటపెట్టడమే తమకు ముఖ్యమని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు బృందం ఇచ్చిన నివేదికపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. గతేడాది జూన్ 12వ తేదీన అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ఇండియా ఏఐ-171 బోయింగ్ విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 229 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో పాటు భూమిపై ఉన్న 19 మంది.. మొత్తం 260 మంది మృతిచెందారు. ఈ ఘటనలో విమాన వ్యవస్థలు, బ్లాక్ బాక్స్ డేటా, ఇంజిన్ భాగాల విశ్లేషణలో ఏఏఐబీ కీలక పురోగతి సాధించింది. పౌర విమానయాన శాఖకు ఐదు ప్రధాన డిమాండ్లతో బాధితుల కుటుంబ సభ్యులు లేఖలు రాశారు. ÷నైల్ రిపోర్ట్ ఇచ్చే ముందు స్వతంత్ర 'ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్ వాలిడేషన్ టెస్టులు' నిర్వహించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు పురోగతిపై ప్రతి 15 లేదా 30 రోజులకు ఒకసారి కుటుంబాలకు అధికారికంగా సమాచారం అందించాలని అధికారులకు కేంద్రమంత్రి సూచించారు. కేసు విచారణ బృందంలో బోయింగ్ 787 నడిపిన అనుభవం ఉన్న సీనియర్ కమర్షియల్ పైలట్‌ను చేర్చాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తు చట్టపరమైన హక్కులను కోల్పోయేలా బాధితులపై ఎలాంటి బలవంతపు ఒప్పందాల సంతకాలు చేయించవద్దని అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు. ఈ ఘటనపై తుది నివేదిక విడుదలకు ఓ కచ్చితమైన కాలపరిమితిని ప్రకటించాలని కుటుంబ సభ్యులు కోరారు. బాధితుల కుటుంబ సభ్యుల లేఖపై కేంద్రమంత్రి స్పందించారు. అంతర్జాతీయ దర్యాప్తు నిబంధనల ప్రకారమే విచారణ వేగంగా సాగుతోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ స్పష్టం చేశారు.

# టిటిడి అధికారిక వెబ్‌సైట్‌నే ఫాలో కండి

**నకిలీ పోర్టల్‌లతో జాగ్రత్త : అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి**



**తిరుమల, జులై 15 :** తిరుమల శ్రీవారి దర్శనం, వసతి గదులు, ఆర్జిత సేవలు తదితర బుకింగ్‌ల కోసం భక్తులు తప్పనిసరిగా తితిదే అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా వేదికలలో, అనధికారిక వెబ్‌సైట్లలో, మధ్యవర్తుల ద్వారా వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోవద్దని ఆయన భక్తులకు సూచించారు. భక్తుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని కొందరు నకిలీ వెబ్‌సైట్లు, అక్రమ మార్గాల ద్వారా డబ్బులు వసూలు చేసే ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని, అలాంటి వారి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. శ్రీవారి దర్శనం, వసతి, సేవల బుకింగ్‌లు, టికెట్ల విడుదల, రద్దు అయిన టికెట్ల లభ్యత, వివిధ దర్శనాల సమాచారం, వేచి ఉండే సమయం వంటి అన్ని వివరాలను తితిదే అధికారిక వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. అలాగే ఎస్‌వీబీసీ ద్వారా కూడా భక్తులకు నిరంతరం అధికారిక సమాచారాన్ని చేరవేస్తున్నామని చెప్పారు. టికెట్లకు సంబంధించిన ఏవైనా సందేహాలు ఉంటే తితిదే కాల్ సెంటర్ నెం. 155257 సంప్రదించాలని, అక్కడ అధికారికంగా పూర్తి సమాచారం, స్పష్టత అందిస్తారని తెలిపారు. శ్రీవారి సేవలో పారదర్శకత, భక్తుల భద్రతకు తితిదే అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అధికారిక మార్గాల ద్వారానే సేవలను పొందాలని తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి భక్తులకు పునరుద్ఘాటించారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం

- పల్నాడు జిల్లా వాసి ప్రసన్న దుర్మరణం
- కన్నీరుమున్నీరు అవుతున్న కుటుంబ



**పల్నాడు,జూలై15 :** అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్నాడు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన మక్కెన ప్రసన్న (27) మృతి చెందారు. రైతు కుటుంబానికి చెందిన మక్కెన వెంకటేశ్వర్లు, గోవిందమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో పెద్ద కుమార్తె ప్రసన్న 2022లో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లారు. అక్కడే ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం ప్రసన్న తన ముగ్గురు స్నేహితులతో కలిసి కారులో ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసన్న అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె స్నేహితులకు గాయాలయ్యాయి. పెద్ద కుమార్తె మరణ వార్త విన్న వెంకటేశ్వర్లు కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. దీంతో ఉమ్మడివరం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు.. మృతురాలి తండ్రికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రసన్న భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకురావాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# అందరూ కలిసే చమురు వ్యాపారం చేయాలి : ఇరాన్

**టెహ్రాన్ :** పశ్చిమాసియాలో చమురు ఎగుమతులు చేస్తే అన్ని దేశాలు కలిసే చేయాలని.. లేదంటే ఎవరూ చేయకూడదని ఇరాన్ స్పష్టం చేసింది. బహ్రెయిన్‌లోని యూఎస్ నేవీ స్థావరంపై ఐఆర్‌జీసీ దాడులు చేసిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. తమను కాదని ముందుకు వెళ్తే.. అమెరికా మిత్రదేశాల చమురు, గ్యాస్ ఎగుమతి మార్గాలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని.. పశ్చిమాసియా నుంచి చమురు, గ్యాస్ ఎగుమతుల మొత్తాన్ని ఆపుతామని హెచ్చరించింది. 'హర్మూజ్ జలసంధిపై నియంత్రణ సాధించామని చెబుతూ.. అమెరికా నిన్న రాత్రి హిందూ మహాసముద్రంలో సముద్రపు దొంగలను మోహరించింది. నౌకల రాకపోకలకు మార్గాలను మూసివేసి.. చమురు, గ్యాస్‌లను ప్రపం చానికి అందకుండా చేసింది. దీనివల్ల ఆ దేశ ఆర్థిక ప్రత్యర్థుల ప్రయోజనాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. వారి దుర్మార్గాలకు తగిన బుద్ధి చెప్పడానికి మా దళాలు బహ్రెయిన్‌లోని 5వ ఫ్లీట్ బేస్‌పై విజయవంతంగా దాడి చేశాయి. ఈ దాడుల్లో ఎన్ఎస్ఐ మేనేజ్‌మెంట్ సెంటర్, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు ధ్వంసమయ్యాయి. పశ్చిమాసియాలో వ్యాపారం చేస్తే అందరూ కలిసే చేయాలి. లేదంటే ఎవరూ చేయకూడదు' అని ఐఆర్‌జీసీ హెచ్చరించింది.

# అయోధ్య రామాలయ సీఈవో పదవికి 1,000 దరఖాస్తులు



**అయోధ్య :** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పదవికి ఇప్పటి వరకు 1,000కి పైగా దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు. నోటిఫికేషన్ విడుదలైన 24 గంటల్లోనే భారీగా అప్లికేషన్లు వచ్చాయి. దరఖాస్తుదారులలో రాజకీయ నేపథ్యం ఉన్నవారు.. మాజీ ఉన్నతాధికారులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు ఉన్నట్లు తెలుస్తోంది. జులై 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని.. పరిశీలన ప్రక్రియ జులై 19 నుంచి ప్రారంభమవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈనెల 22న జరగనున్న ట్రస్ట్ సమావేశంలో సీఈవో నియామకంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాంట్రాక్టు పద్ధతిలో మూడేళ్ల పదవీకాలానికి సీఈవోను నియమిస్తామని, పనితీరు ఆధారంగా తర్వాత పొడిగింపు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. ట్రస్ట్ నిర్ణయాలను అమలు చేయడం, ఆర్థిక వ్యవహారాలు, కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటం వంటి బాధ్యతలను కొత్త సీఈవో నిర్వర్తించాల్సి ఉంటుంది.



# అమెరికాలో టైమ్ సవరణ విధానానికి చెక్

**బిల్లును ఆమోదించిన ప్రతినిధుల సభ**

**వాషింగ్టన్, జూలై 15 :** ఏటా రెండుసార్లు గడియారాల్లో సమయాన్ని మార్చే విధానానికి స్వస్తి పలికేందుకు అమెరికా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 'డేలైట్ సేవింగ్ టైమ్'ను ఏడాది పొడవునా శాశ్వతం చేయడం కోసం ప్రవేశపెట్టిన 'సన్‌÷న్ ప్రొటెక్షన్ యాక్ట్' బిల్లుకు అక్కడి ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. ప్రతినిధుల సభలో మంగళవారం జరిగిన ఓటింగ్‌లో 308-117 ఓట్ల భారీ మెజారిటీతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ప్రతినిధుల సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు అధ్యక్షుడు సంతకం చేస్తే అధికారిక చట్టంగా మారుతుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించారు. తాను అధికారంలోకి వస్తే ఈ గడియారాలు మార్చే విధానాన్ని ముగిస్తానని గతంలోనే ఆయన హామీ ఇచ్చారు. ఈ చట్టం వల్ల ప్రజలకు సాయంత్రం పూట ఎక్కువ సమయం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ ఈ బిల్లుపై అతి త్వరలో సంతకం చేయనున్నారు. సూర్యుడు త్వరగా ఉదయించే వేసవి నెలల్లో.. ఉదయం 4 నుంచి 5 గంటలకే ఎండ వచ్చేస్తుంది. ఆ సమయంలో చాలామంది నిద్రపోతుంటారు. చాలా వరకు సమయం నిద్రలోనే వృధా అవుతుంది. గడియారాన్ని ఒక గంట ముందుకు జరపడం వల్ల.. సాయంత్రం పూట సహజమైన సూర్యకాంతిని ఎక్కువ సమయం ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. అమెరికా, కెనడా, బ్రిటన్, ఐరోపా దేశాలతో పాటు దాదాపు 70కి పైగా దేశాలు ఈ విధానాన్ని పాటిస్తున్నాయి. అమెరికన్లు వేసవి కాలంలో గడియారాలను ఒక గంట ముందుకు జరుపుతారు. దీన్నే 'స్ప్రింగ్ ఫార్వర్డ్' అంటారు. శీతాకాలంలో మళ్లీ ఒక గంట వెనక్కి జరుపుతారు. దీన్నే 'ఫాల్ బ్యాక్' అంటారు. ఇలా సమయాన్ని మార్చే విధానాన్ని పూర్తిగా ఆపేసి.. ఏడాది పొడవునా ఒకే టైమ్ ఉంచాలనే ఉద్దేశంతోనే అమెరికా ప్రభుత్వం కొత్త బిల్లును తీసుకువచ్చింది.

# బ్యాంక్ ఆస్తివేలం వివాదం కేసు

**సుప్రీంలో బండ్ల గణేశ్ పిటిషన్**

**న్యూఢిల్లీ, జూలై 15 :** ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ ఆస్తి వేలం వివాదం కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గణేశ్ తన ఆస్తి వేలం వ్యవహారంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న చర్యలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టు వెళ్లారు. హైదరాబాద్‌కు చెందిన మెస్సర్స్ శ్రీ పరమేశ్వర పౌల్ట్రీ ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు యూనియన్ బ్యాంక్ అందించిన రుణాలకు గానూ, బండ్ల గణేశ్ ఆయన కుటుంబ సభ్యులు తమ సొంత ఆస్తులను పూచీకత్తుగా తాకట్టు పెట్టారు. కార్పొరేట్ దివాలా పరిష్కార పక్రియ సమయంలో, బ్యాంక్ తనఖా పెట్టిన ఆస్తిని వేలం వేసింది. ఈ వేలం పక్రియను సవాలు చేస్తూ బండ్ల గణెశిశ్ డెబ్ట్స్ రికవరీ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా, అది ఆయనకు అనుకూ లంగా తీర్పునిచ్చింది. వేలం పక్రియ నిలవదని పేర్కొం టూ, ఆస్తిని తిరిగి యజమానులకు అప్పగించాలని, కొనుగోలుదారుకు సొమ్మును వడ్డీతో సహా వాపసు చేయాలని డీఆర్టీ ఆదేశించింది. అయితే, ఈ తీర్పును సవాలు చేస్తూ బ్యాంక్ తెలంగాణ హైకోర్టుకు వెళ్లింది. డీఆర్టీ ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేస్తూ బ్యాంక్ చర్యను సమర్థించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ బండ్ల గణెశిశ్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు వచ్చే సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.



## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్**

**దుబ్బాక,జూలై15 (జనంవార్త) :** కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను 100 శాతం పూర్తయ్యే విధంగా బిఎల్ఓలు కృషి చేయాలని దుబ్బాక పురపాలిక కమిషనర్ ఎ.మహేష్ కుమార్ అన్నారు.దుబ్బాక పురపాలికలోని దుంపలపల్లి 4,5 వార్డులు, చెల్లాపూర్ లోని 2,3 వార్డులు,మల్లయ్య పల్లెలోని ఒకటో వార్డులో కొనసాగుతున్న సర్ నిర్వహణ ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఎన్యునరేషన్ ఫారాలను నింపి,వారి దగ్గరే పెట్టుకోకుండా, తప్పనిసరిగా వాటిని బిఎల్ఓలకు అందించాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో ఓటర్లకు అధికారులు,మెప్మా సిబ్బంది పూర్తిగా సహకరిస్తున్నారని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా, ఎలాంటి తప్పులు లేకుండా సర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశం ఓటరు జాబితా ప్రక్షాళన చేయడమే తప్ప మరియు ఓటర్లను తొలగించడం కాదని స్పష్టం చేశారు.సర్ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్కరూ కూడా వారి ఓటు హక్కు నష్టపోరన్నారు.ఆయన వెంట వార్డు ఆఫీసర్లు, బిఎల్ఓలు,పుర సిబ్బంది తదితరులు ఉన్నారు.



## అర్హులైన ఒక్క ఓటరు నష్టపోకుండా చూడాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్**

**సికింద్రాబాద్ :** అర్హులైన ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు.బుధవారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించేందుకు ఆయన లాలాపేట డివిజన్‌లోని వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. లాలాపేట, గడీ స్కూల్, వినోభానగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను పరిశీలించి, అక్కడి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని కేంద్రాల వద్ద సహాయ శిబిరాలను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ఆదేశించారు.అలాగే, సీతాఫలమండిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు తీగుళ్ల కిశోర్ కుమార్, సమన్వయకర్త రాజా సుందర్, బీఎల్ఓలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## 'మై భారత్ పోర్టల్' నమోదును ప్రారంభించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్ :** తెలంగాణ దేశ నిర్మాణ కార్యక్రమాలలో యువత భాగస్వామ్యాన్ని గరిష్ఠం చేసే లక్ష్యంతో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ' మై భారత్ ' పోర్టల్‌లో నమోదు కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా, ఫైజాన్ అహ్మద్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి, 15 నుండి 29 ఏళ్ల మధ్య వయస్సు గల అర్హులైన యువత అంతా మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సేవ, అనుభవపూర్వక అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవ భారత ప్రభుత్వం చేపట్టిన వివిధ యువజన – కేంద్రీకృత కార్యక్రమాలలో పాల్గొనే అవకాశాలను ఈ వేదిక కల్పిస్తుందని ఆయన వివరించారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఈ నమోదు కార్యక్రమంలో విద్యా సంస్థలు, ప్రభుత్వ శాఖలు, యువజన సంఘాలు, ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు ఇతర భాగస్వామ్య పక్షాలు చురుకుగా పాల్గొని, అర్హులైన యువత గరిష్ఠ సంఖ్యలో నమోదు చేసుకునేలా చూడాలని కోరారు. నమోదు ప్రక్రియతో పాటు మై భారత్ పోర్టల్ ద్వారా నమోదైన యువతకు లభించే ప్రయోజనాలు, అవకాశాలను వివరించారు. ఈ విస్తృత నమోదు కార్యక్రమం కళాశాలలు, విద్యా సంస్థలు, గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థలు ఇతర ప్రభుత్వ సంస్థలలో అవగాహన కార్యక్రమాలు అక్కడికక్కడే నమోదు చేసుకునే శిబిరాల ద్వారా నిర్వహించబడుతుంది. ఈ ప్రచార కార్యక్రమాన్ని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం సహకారంతో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్ విభాగం సమన్వయం చేస్తోంది. అర్హులైన యువత అంతా మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో చురుకుగా భాగస్వాములు కావాలన్నది లక్ష్యం. ఈ ప్రారంభ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్, ఆఫీస్ అసిస్టెంట్ డి. శ్రీశైలం పాల్గొన్నారు.

## ప్రజాసేవకే నా జీవితం అంకితం : బండి రమేష్

- జన్మదినాన్ని సంబరంగా కాకుండా ప్రజాసేవే లక్ష్యంగా సంకల్పం
- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ
- కూకట్‌పల్లిలో ఘనంగా బండి రమేష్ జన్మదిన వేడుకలు



**కూకట్‌పల్లి, జులై 15, (జనం వార్త) :** ప్రజాసేవకే తన జీవితం అంకితమని, జన్మదినాన్ని ఓ సంబరంగా కాకుండా నియోజక వర్గ ప్రజల సేవే లక్ష్యంగా సంకల్పం తీసుకుంటున్నట్లు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షులు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అన్నారు. బుధవారం బండి రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని కూకట్ పల్లి ఎన్ కె ఎన్ ఆర్ గార్డెన్స్ లో వసంత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిలారు శ్రీనివాస బాబు, కాంగ్రెస్ నాయకులు చావా శ్రీనివాసరావు, మాకినేని



వినోద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బండి రమేష్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కమ్మ సంఘం నాయకులు బండి రమేష్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అభిమానులు ఏర్పాటుచేసిన 60 కిలోల కేక్ ను బండి రమేష్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ తనపై చూపుతున్న ప్రేమ ఆదరాభిమానాలకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు .తెలిపారు.ఈ జన్మదినాన్ని కేవలం సంబరంగా కాకుండా ప్రజాసేవకు అంకితమయ్యే సంకల్పం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి, పేదల సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్య కర్తలు, కమ్మ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం ఉండటం దురదృష్టకరం

**తలసాని శ్రీనివాస్ యాదవ్**

**సికింద్రాబాద్ :** ప్రజా సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం రాష్ట్రంలో ఉండటం దురదృష్టకరమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. బుధవారం పద్మారావు నగర్‌లోని వెస్లీ చర్చి సమీపంలో రూ.64.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సరఫరా, స్ట్రీట్‌లైట్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన తలసాని సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు అమలు చేయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, కళ్యాణలక్ష్మి––షాదీముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయలేదని ప్రశ్నించారు.పేరుకే ప్రజా ప్రభుత్వం తప్ప ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవించారని, కాంగ్రెస్



ప్రభుత్వం వచ్చిన తర్వాతే విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తాయని ఆరోపించారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, తగిన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పద్మారావు నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, వాటర్ వర్క్స్ డీజీఎం వెంకట్ రెడ్డి, ఏఈ మురళి, ఎలక్ట్రికల్ ఏఈ రాజు, హార్టికల్చర్ అధికారి సత్యనారాయణ, బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు లక్ష్మీపతి, సుధాకర్ రెడ్డి, యాదగిరి యాదవ్, పాషా, మహేందర్ గౌడ్, కనకయ్య, ప్రేమ్, హరిచారి, కుమార్ యాదవ్, సాయిరాం చారి, కొత్తూరు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటర్ రమణమూర్తిపై దాడి హేయమైన చర్య

**ఆర్ఎస్డిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లెటూరు ప్రసాద్**



**దుబ్బాక, జూలై 15 (జనం వార్త) :** బి.ఆర్.కె న్యూస్ టీవీ లైవ్ డిబేట్‌లో మంగళవారం జై భారత్ మూవ్‌మెంట్ నాయకుడు,విద్యావేత్త, విజయ విహారం పత్రిక సంపాదకు లు రమణమూర్తి పై సహ–ప్యానలిస్ట్ ధర్మవీర్ కశ్యప్ రెడ్డి చేసిన భౌతిక దాడి అత్యంత హేయమైనదని న్యాయవాది,ఆర్.ఎస్.డి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లెటూరు ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ భావప్రకటన స్వేచ్ఛను హింసతో, మతోన్మాదంతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు.చర్చల్లో వాదనను వాదనతో ఎదుర్కోవాలి తప్ప, ఇలాంటి దిగజారు డు చర్యలకు పాల్పడటం సహించరానిదన్నారు . రమణమూర్తి పై దాడికి తెగబడిన ఆ మతోన్మాదిపై చట్టప్రకారం తక్షణమే కఠినమైన క్రిమినల్ చర్యలు చేపట్టాలని, అతడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాజ్యాంగం కల్పించిన హక్కులను రక్షించుకోవడానికి, దేశ మానవత వాదులు ఏకం కావాలని పిలుపునిచ్చారు.ఇలాంటి అరాచక శక్తులకు బుద్ధి చెప్పడానికి మనమంతా ఏకం కావాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.



## భారీ చోరీ కేసును ఛేదించిన దుబ్బాక పోలీసులు


**తీర్థయాత్రలకు వెళ్లి వచ్చేసరికి ఇల్లుగుల్ల**

**80 తులాల బంగారం, 5.5 కేజీల వెండి స్వాధీనం**

**దుబ్బాక,జూలై 15(జనం వార్త) :** దుబ్బాకలో సంచలనం సృష్టించిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసిఅతని వద్ద నుండి 80 తులాల బంగారం, 5.5 కిలోల వెండి ఆభరణాలు,నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసులో మరో నిందితుడిగా జైలు కానిస్టేబులు చేర్చగా, అతడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ బుధవారం వెల్లడించారు.సీపీ తెలిపిన వివరాల ప్రకారం..దుబ్బాక పట్టణానికి చెందిన మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు చింత రాజ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రకు వెళ్లి ఇంటికి తాళం వేశారు.ఇదే అదనుగా భావించిన ధర్మాజీపేట గ్రామానికి చెందిన బిక్షపతి ఇంటి కిటికీ ఊచలను విరగగొట్టి లోనికి ప్రవేశించి బంగారం,వెండి ఆభరణాలను అపహరించాడు. ఆనవాళ్లు లేకుండా చేసేందుకు ఇంట్లోని సీసీటీవీ కెమెరాల డీవీఆర్ ను కూడా వెంట తీసుకెళ్లాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు సీసీటీవీ విశ్లేషణతో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 80 తులాల బంగారం, 5.5 కిలోల వెండి,కొంత నగదును స్వాధీనంచేసుకున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న రెండు ఆభరణాలు రోల్డ్ గోల్డ్ తేలినట్లు సీపీ తెలిపారు. దర్యాప్తులో నిందితుడు బిక్షపతి ఇటీవలే నిజామాబాద్ నుంచి విడుదలైనట్లు గుర్తించారు.అతడి విడుదలకు జైలు కానిస్టేబుల్ గోపాల్ సహకరించినట్లు విచారణలో వెల్లడైందని, దీంతో గోపాల్ను కేసులో ఏ–2గా చేర్చినట్లు తెలిపారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉండగా,అతడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు బిక్షపతిపై సిద్దిపేట,మెదక్,మేడ్చల్, సంగారెడ్డి,కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో మొత్తం 63 చోరీ కేసులు నమోదైనట్లు సీపీ వెల్లడించారు.ఈ కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన పోలీసు అధికారులను,దర్యాప్తు బృందాన్ని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించారు.

# రైతు సంక్షేమానికి 'డిజిటల్' బాట

### ఫార్మర్ రిజిస్ట్రీ'తోనే సాగుకు భరోసా!




**హైదరాబాద్:**

**దేశానికి వెన్నెముకైన రైతుకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా, పారదర్శకంగా అందాలన్నదే కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్యాన్ని కార్యరూపం దాల్చేలా రూపొందించిన కీలక సంస్కరణే 'యూనిక్ ఫార్మర్ ఐడీ -ఫార్మర్ రిజిస్ట్రీ'. మధ్యవర్తుల మోసాలు, నకిలీ లబ్ధిదారుల దందా, డూప్లికేట్ రికార్డులకు చెక్ పెట్టేలా ఈ డిజిటల్ వ్యవస్థ రూపుదిద్దుకుంది.**

### ఆధార్ తరహాలోనే 'ఫార్మర్ ఐడీ' కీలకం

సాధారణ పౌరుడికి 'ఆధార్' ఎంత అవసరమో, ఇకపై రైతుకు 'ఫార్మర్ ఐడీ' అంతే కీలకం. ఇది కేవలం ఒక సంఖ్య కాదు రైతు హక్కులకు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు, సాగు భవిష్యత్తుకు ఇచ్చే డిజిటల్ భరోసా.

### ఒకే రికార్డు - రైతు పూర్తి ప్రొఫైల్

ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా రైతుకు సంబంధించిన పూర్తి సమాచారం ఒకే చోట నిక్షిప్తమవుతుంది:

**భూమి వివరాలు :** సాగు విస్తీర్ణం మరియు భూమి రికార్డులు.

**పంటల స్వభావం :** ఏ కాలంలో ఏ పంటలు వేస్తున్నారనే సమాచారం.

**ఆర్థిక వివరాలు :** బ్యాంక్ ఖాతా మరియు ఇప్పటివరకు పొందిన పథకాల లబ్ధి.

**అధికారిక గుర్తింపు:** దీని ద్వారా రైతు ప్రభుత్వ రికార్డుల్లో శాశ్వత లబ్ధిదారుడిగా గుర్తింపు పొందుతాడు.

### తెలంగాణలో పరిస్థితి:

తెలంగాణలో సుమారు 65––70 లక్షల మంది రైతులు ఉండగా, ప్రస్తుతం కేవలం 45 శాతం మంది మాత్రమే రిజిస్ట్రీ ప్రక్రియలో ఉన్నారు. అవగాహన లోపం వల్ల దాదాపు 30 లక్షల మంది రైతులు ఇంకా ఈ డిజిటల్ గుర్తింపుకు దూరంగా ఉన్నారు. ఇది భవిష్యత్తులో వారికి అందాల్సిన ప్రభుత్వ సాయానికి ఆటంకంగా మారే ప్రమాదం ఉంది. ఫార్మర్ ఐడీ లేకపోతే పీఎం కిసాన్ నిధులు, పంట బీమా క్లెయిమ్స్, మద్దతు ధరకు పంట విక్రయం , ఎరువులు మరియు విత్తనాల సబ్సిడీ వంటివి నిలిచిపోయే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

### నమోదు ప్రక్రియ.. సులభం, ఉచితం

రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఈ ప్రక్రియను సరళతరం చేశారు. కింది పత్రాలతో సంప్రదించాలి:

ఆధార్ కార్డు (మొబైల్ నంబర్ లింక్ అయి ఉండాలి).

పట్టాదారు పాస్‌పుస్తకం.

బ్యాంక్ ఖాతా వివరాలు.

**ఎక్కడ సంప్రదించాలి?:** సమీపంలోని రైతు వేదికలు, మండల వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారి లను కలిసి వ–ఖ్జ పూర్తి చేయవచ్చు. త్వరలోనే మీ–సేవా కేంద్రాల ద్వారా కూడా ఈ సేవ అందుబాటులోకి రానుంది.

### ప్రయోజనాలు అనేకం:

**నేరుగా నగదు బదిలీ :** పెట్టుబడి సాయం ఎటువంటి జాప్యం లేకుండా నేరుగా ఖాతాలో పడుతుంది.

**పారదర్శకత:** నకిలీ లబ్ధిదారుల ఏరివేత, నిజమైన రైతుకే ప్రాధాన్యత.

**ప్రణాళికాబద్ధ వ్యవసాయం :** విత్తనాలు, ఎరువుల పంపిణీలో ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది. సాంకేతికతను అందిపుచ్చుకున్న రైతే ఆధునిక వ్యవసాయంలో విజేత అవుతాడు ,అందుకే, అన్నదాతలు ఆలస్యం చేయకుండా వెంటనే అంకెల ఐడీని పొంది తమ సాగుకు భద్రత కల్పించుకోవాలి.



**– జి.అజయ్ కుమార్**
**వ్యవసాయ నిపుణులు**

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..



## భారత్ పెట్టుబడుల్లో 25శాతం మనరాష్ట్రానికే..

- దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ
- శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్
- జగన్‌ది హిట్ అండ్ రన్ పార్టీ అంటూ విమర్శలు

**కడప,జులై 15 :** రాష్ట్రంలో అనుమతులు త్వరగా ఇవ్వడం వల్లే భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయని అన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమలను తీసుకొస్తున్నామని చెప్పారు. వైఎస్‌ఆర్ కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండోప్లాంట్ విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. దాల్మియా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియాతో కలిసి లోకేశ్ భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. సిమెంట్ ఉత్పత్తి రంగంలో దాల్మియా గ్రూప్ బలమైందన్నారు. దీంతో ఎంతో మందికి ఉపాధి లభిస్తోందని చెప్పారు. వైకాపా హయాంలో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ చాలా దెబ్బతిందన్నారు. మళ్లీ అభివృద్ధి స్థాయికి రాష్ట్రాన్ని తీసుకురావడానికి రెండేళ్లు అహర్నిశలు కష్టపడ్డామని చెప్పారు. రూ.3,100 కోట్లతో చేపడుతున్న ఈ పరిశ్రమ విస్తరణ పనులతో మరో 700 మందికి ఉపాధి లభించనుంది. ఈ సందర్భంగా మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నారా లోకేశ్ మరోసారి విరుచుకుపడ్డారు. జగన్ కడపకు పట్టిన క్యాన్సర్ గడ్డ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత బాబాయి వివేకానంద రెడ్డిని చంపింది జగనే అని ఆరోజు పాదయాత్రలో చెప్పానని... ఈరోజు కూడా చెబుతున్నానన్నారు. జగన్ పార్టీ.. హిట్ అండ్ రన్ పార్టీ అంటూ దుయ్యబట్టారు. 'మాజీమంత్రి కొడుకు రోడ్డు ప్రమాదం చేసి ఒకరిని చంపితే తప్పుకాదా? కొడుకు తప్పు చేస్తే ఒక కేంద్రమంత్రి వెంటనే సరెండర్ చేశారు. మీ మాజీమంత్రి తప్పు చేస్తే.. మీరేం చేశారు? గతంలో జగన్ కారు టైర్ల కింద నలిగి ఒకరు చనిపోయారు. ఇవన్నీ వీళ్లకు చిన్న విషయాలులానే ఉంటాయి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రాహ్మణీ స్టీల్స్‌కు అప్పట్లో ఎకరాకు రూ.19 వేల చొప్పున 11 వేల ఎకరాలు కేటాయించారని మంత్రి తెలిపారు. బ్రాహ్మణీ వల్ల లబ్ధి పొందింది.. గాలి జనార్దన్ రెడ్డి, జగన్ రెడ్డిలు మాత్రమే అని అన్నారు. లీగల్ ప్రాసెస్ చూసుకొని ఆ భూములను స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసిందేమీ లేదని విమర్శించారు. జగన్ హయాంలో 250 మంది మత్స్యకారులు చనిపోతే ఒక్కరికీ పరిహారం ఇవ్వలేదని అన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో బాధిత మత్స్యకారుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.10 లక్షల పరిహారం ఇచ్చినట్లు తెలిపారు. జగన్ హయాంలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని.. కూటమి ప్రభుత్వ హయాంలో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. మళ్లీ నోటిఫికేషన్‌లు ఇస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

## లైఫ్‌గార్డుల రాకతో తప్పిన ముప్పు

### విశాఖ బీచ్‌లో ఐదురుగు నల్లగొండ పర్యాటకుల సేఫ్

**విశాఖపట్టణం, జూలై 15 :** విశాఖ ఆర్కే బీచ్‌లో ఐదుగురు నల్గొండ పర్యాటకులకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. బీచ్ లైఫ్‌గార్డులు సకాలంలో స్పందించడంతో కొట్టుకుపోతున్న వారిని సురక్షితంగా కాపాడారు. నల్గొండ జిల్లా ముషంపల్లికి చెందిన స్నేహితులు బుధవారం విశాఖ ఆర్కే సముద్రతీరంలో స్నానం చేస్తుండగా భారీ అలలతో కొట్టుకుపోయారు. గమనించిన జీవీఎంసీ లైఫ్‌గార్డు ఎం.ధనరాజ్‌తో పాటు మరికొందరు సముద్రంలోకి వెళ్లి పర్యాటకులను కాపాడారు. దీంతో నల్గొండ పర్యాటకులకు ప్రాణగండం తప్పడంతో లైఫ్‌గార్డు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆగస్టు 12న జాతీయ రిమోట్ సెన్సింగ్ దినోత్సవం

### ఇండియా స్పేస్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వర్క్‌షాప్

**విజయవాడ, జులై 15 :** 15 జులై 2026.భారత అంతరిక్ష పరిశోధన పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ జయంతిని పురస్కరించుకుని ఇండియా స్పేస్ ల్యాబ్ ప్రతి సంవత్సరం ఆగస్టు 12న జాతీయ రిమోట్ సెన్సింగ్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.దేశ అభివృద్ధి, సహజ వనరుల నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, విపత్తు నివారణ వంటి రంగాల్లో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి సమర్థవంతంగా వినియోగించడంలో డాక్టర్ విక్రమ్ సారాభాయ్ చేసిన దూరదృష్టితో కూడిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ ఆయన జన్మదినాన ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా విపత్తు సంసిద్ధత, పర్యవేక్షణ, అంచనా, ప్రతిస్పందన మరియు సుస్థిర అభివృద్ధిలో భౌగోళిక సాంకేతికతల పాత్రపై అవగాహన పెంపొందించడంతో పాటు జ్ఞానాన్ని విస్తరించే లక్ష్యంతో "విపత్తు నిర్వహణ కోసం రిమోట్ సెన్సింగ్ మరియు ఉమో" అంశంపై ఆన్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ప్రభుత్వ అధికారులు, విపత్తు నిర్వహణ నిపుణులు మరియు ఇతర ఆసక్తి గల భాగస్వాములను దృష్టిలో ఉంచుకుని ఈ వర్క్‌షాప్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. ఇందులో రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (ఉమో), పర్యావరణ పరిశీలన సాంకేతికతలు, జియో ఏఐ (ఉవనీ ంఎ), డ్రోన్ మ్యాపింగ్, మెషిన్ లెర్నింగ్ అనువర్తనాలు, అలాగే వాస్తవ ప్రపంచ విపత్తు నిర్వహణకు సంబంధించిన కేస్ స్టడీస్ వంటి పలు కీలక అంశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.ఈ ఆన్‌లైన్ వర్క్‌షాప్‌ను 2026 ఆగస్టు 12న నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనదలచిన వారు రూ. 270 నమోదు రుసుము చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియ 2026 జూన్ 10 నుంచి జూలై 30 వరకు కొనసాగుతుందని తెలిపారు.వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఇ-సర్టిఫికేట్ అందజేయనున్నట్లు ఇండియా స్పేస్ ల్యాబ్ డైరెక్టర్ వెల్లడించారు

# నదుల అనుసంధానంతోనే కరువు నివారణ

- పెన్నా- వంశధార నదుల అనుసంధానం లక్ష్యం
- పట్టిసీమతో గోదావరి తరలింపు చేపట్టి చూపాం
- కెఎల్ రావు దార్శనికత వల్లనే అనేక ప్రాజెక్టుల నిర్మాణం
- గంగా-కావేరి నదుల అనుసంధానం చేస్తే తిరుగుండదు
- కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి
- మార్చి 2027 నాటికి పోలవరం జాతికి అంకితం చేస్తామన్న చంద్రబాబు



**విజయవాడ, జూలై 15 :** నదుల అనుసంధానం పూర్తి చేస్తే.. రాష్ట్రానికి కరవు ఉండదని స్పష్టం ముఖ్యమంత్రి చంద్రబాబు చేశారు. పెన్నా-వంశధార నదుల అనుసంధానం చేయాలనేది లక్ష్యమని పేర్కొన్నారు. . వచ్చే మూడేళ్లలో రూ.35వేల కోట్లు ఖర్చు చేసి.. 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. గంగా-కావేరి నదుల అనుసంధానం చేయగలిగితే దేశానికి తిరుగుండదన్నారు. రెండేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.24వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని కృష్ణా- గోదావరి జలాల పవిత్ర సంగమం వద్ద జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో కృష్ణవేణి - గోదావరి నదుల సంగమ ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జలాలకు పుష్పమాల, వస్త్రాలు, పసుపు- కుంకుమ సమర్పించారు. కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి ఇచ్చారు. మార్చి 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణకు ఈనెలలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయ్యాయని, ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు జలహారతి ఇస్తామని ప్రకటించారు. సెప్టెంబరు 1న వెలిగొండ ఫేజ్-1 ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తామన్నారు. ఎక్కడ నాకు పేరొస్తుందోనని.. నాడు పట్టిసీమ నిర్మిస్తుంటే అందరూ నన్ను విమర్శించారు. పట్టిసీమ ఒట్టిసీమ అన్నారు. విమర్శలు పట్టించుకొని ఉంటే పదేళ్లలో కృష్ణాడెల్టా ఏమయ్యేదో. వారి విమర్శలు పట్టించకోకుండా రూ.1300 కోట్లు ఖర్చు పెట్టి పట్టిసీమ పూర్తిచేశా. గోదావరి నుంచి కృష్ణానదికి 450 టీఎంసీలు తీసుకొచ్చాం. పట్టిసీమ వల్ల కరవు సీమ.. హార్టికల్చర్ హబ్‌గా తయారైంది. నీళ్లుంటే పరిశ్రమలు వస్తాయి, ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆపై ప్రముఖ ఇంజినీర్ కేఎల్ రావు 124వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. శ్రీశైలం, నాగార్జునసాగర్ లాంటి అతిపెద్ద ప్రాజెక్టుల నిర్మాణంలో కేఎల్ రావు కీలకపాత్ర పోషించారు. ఆయన విజయవాడలో జన్మించడం మన అదృష్టం. ముగ్గురు ప్రధానుల దగ్గర పనిచేసిన గొప్ప వ్యక్తి. నీళ్లు ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి జరుగుతుంది.ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణగా ఖ్యాతి గడించిందటే కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలే కారణం. శ్రీశైలం, నాగార్జునసాగర్ నిర్మించకుంటే ఏపీ ఇబ్బంది పడేది. ఏడాదిలో పట్టిసీమ పూర్తి చేసి కృష్ణాడెల్టాను కాపాడిన ఘనత తెలుగుదేశం పార్టీదని వివరించారు. 80 టీఎంసీలతో 13 లక్షల ఎకరాలు స్థిరీకరించాం. గోదావరి నుంచి ఏటా 2వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తాయి. ఏడాదిలో గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేసి.. కియా ఫ్యాక్టరీ ఏర్పాటు చేశాం. అమరావతిని నిర్మిస్తుంటే విమర్శిస్తున్నారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి కలిపితే అమరావతి. 99శాతానికి పైగా రైతులు అమరావతికి భూములు ఇచ్చారు. ఆగస్టు 15 నాటికి సీడ్ యాక్సిస్ రోడ్డు పూర్తవుతుంది. సీడ్ యాక్సిస్ రోడ్డులో ప్రయాణిస్తే.. అమరావతి విశిష్టత తెలుస్తుందని సీఎం అన్నారు. ఇంజినీర్‌గా కేఎల్ రావు స్ఫూర్తి ప్రతి గ్రామానికీ తీసుకెళ్లేలా ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పట్టిసీమ నుంచి గోదావరి జలాలు కృష్ణమ్మ చెంతకు చేరి ఈ డెల్టాను సస్యశ్యామలం చేస్తున్నాయన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు కృష్ణా నది నుంచి నీటి ప్రవాహం తగ్గిందని తెలిపారు. రైతులు పండించిన పంటలు తుఫాన్ల బారిన పడి నష్టపోతున్న దుస్థితి నుంచి రక్షించాలనే పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టామని సీఎం వెల్లడించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ లాంటి ప్రధానమైన డ్యామ్‌ల నిర్మాణంలో కేఎల్ రావు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఐక్యరాజ్య సమితి తరఫున అంతర్జాతీయ జల నిపుణులుగా ఈజిప్ట్, సూడాన్ లాంటి దేశాల్లోనూ సేవలందించారన్నారు. విజయవాడలో పుట్టి ఎంపీగా ఎన్నికై ముగ్గురు ప్రధానుల వద్ద కేఎల్ రావు కేంద్రమంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. నీటి పారుదల రంగం, జల విద్యుత్ ఉత్పత్తి లాంటి అంశాలపై పనిచేసి దేశానికి సేవలందించారన్నారు. గోదావరి ప్రాంతంలో ధవళేశ్వరం, కృష్ణానదిపై కృష్ణాబ్యారేజీని సర్ ఆర్థర్ కాటన్ నిర్మాణం చేశారని.. ఇది ఏపీని దేశానికే అన్నపూర్ణగా మార్చిన నిర్ణయమని సీఎం చెప్పుకొచ్చారు.

## వాతావరణ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటున్నాం

- దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సీఎం గాడిన పెడుతున్నారు
- వరుసగా రెండో ఏడాది ట్రూ డౌన్ అమలు చేయబోతున్నాం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి, జులై 15 :** దేశంలో ట్రూ-అప్ విధానాన్ని అమలు చేసిన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, ట్రూ-డౌన్ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా మూడో ఏడాదిలోకి అడుగుపెట్టామని, ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలో వాతావరణ హెచ్చుతగ్గుల కారణంగా రోజుకు సుమారు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవుతున్నప్పటికీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. బలమైన గాలుల కారణంగా విద్యుత్ లైన్లకు తాత్కాలిక అంతరాయాలు ఏర్పడుతున్నా, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరిస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వల్పకాలంలోనే గాడిలో పెట్టారని మంత్రి అన్నారు. ట్రాన్స్‌కోను బలోపేతం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా సాగుతోందని వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని తెలిపారు. విద్యుత్ శాఖకు సంబంధించిన రూ.6,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రస్తుతం వివిధ దశల్లో అమలవుతున్నాయని, నిర్ణీత గడువులో అవసరమైన అన్ని సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.



## కరువుతో రాష్ట్రం అల్లాడితే జగన్‌కు ఆనందం

### రాక్షస మనస్తత్వం ఉన్న నాయకుడు జగన్

### చంద్రబాబు ముందుచూపుతో పట్టిసీమ ద్వారా కృష్ణాకు నీరు

### ఎపి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ, జూలై 15 :** కరవు కాటకాలతో రాష్ట్రం అల్లాడిపోవాలనే ఆలోచన జగన్‌దని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాక్షస మనస్తత్వం జగన్‌దని ధ్వజమెత్తారు. పవిత్ర సంగమం వద్ద జలహారతి కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రైతు ద్రోహి జగన్ అని.. అలాంటి వ్యక్తి ఓ పార్టీ అధ్యక్షుడిగా ఉండే అర్హత కూడా లేదని ఎద్దేవా చేశారు. ఎల్‌నినో కారణంగా ఏపీలో ఎక్కడా ఒక చుక్క నీరు కూడా లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల, ప్రాజెక్టుల్లో నీళ్లు లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతోనే ఈరోజు రైతన్నలకు పట్టిసీమ ప్రాణం పోస్తోందని ఉద్ఘాటించారు. కృష్ణా డెల్టాకు, రాయలసీమకు పట్టిసీమతో భద్రత కల్పించారని తెలిపారు. పోలవరం పూర్తి అయ్యేలోపు పట్టిసీమ ద్వారా నీళ్లు పంపిస్తామని చెప్పారు. పట్టిసీమను వట్టిసీమ అని మాట్లాడిన జగన్ కృష్ణానది ఒడ్డుకొచ్చి ఈరోజు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టిసీమ నేడు రూ.50 వేల కోట్ల ఆదాయం సృష్టించిందని మంత్రి నిమ్మల తెలిపారు. పట్టిసీమను వట్టిసీమ అన్న గొడ్డలిపార్టీ నాయకుడు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇప్పటివరకు పట్టిసీమ ద్వారా 445కు పైగా టీఎంసీలను కృష్ణాడెల్టాకు తరలించామని తెలిపారు. ఈసీజన్‌లో ఇప్పటికే 3 టీఎంసీలకు పైగా నీటిని కృష్ణానదిలోకి తరలించామని వెల్లడించారు. తీవ్ర కరవు పరిస్థితుల్లో 13.08 లక్షల ఆయకట్టు ఉన్న కృష్ణాడెల్టాకు నేడు పట్టిసీమ నీళ్లు ఊపిరిపోస్తున్నాయని తెలిపారు. పట్టిసీమ కేవలం కృష్ణాడెల్టాకు మాత్రమే పరిమితం కాదని.. రాయలసీమకు సైతం నీటి భద్రత కల్పించిన పథకమని వ్యాఖ్యానించారు. దేశంలోనే తొలి విజయవంతమైన నదుల అనుసంధాన పథకంగా ఇది గుర్తింపు పొందిందని వివరించారు. పట్టిసీమ కేవలం ఒక ఎత్తిపోతల పథకం కాదని, అన్నదాతలకు ఓ భరోసా అని ఉద్ఘాటించారు. దూరదృష్టి, ముందుచూపు, నిర్మాణాత్మక ఆలోచన కలిగిన నాయకుడు ఉంటే ప్రజలకు ఏవిధంగా మేలు జరుగుతుందో పట్టిసీమే ఉదాహరణ అని మంత్రి నిమ్మల చెప్పుకొచ్చారు. పాలన అనుభవం లేకపోవడం, విధ్వంసపు ఆలోచనలు, ముందుచూపు లేకపోవడం వల్లే గొడ్డలి పార్టీ నాయకుడు పట్టిసీమ వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు సూచనలతో సూపర్ ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొంటామని చెప్పారు. ఇందుకోసం ముందస్తు ప్రణాళికలతో ప్రతి నీటి బొట్టునూ వినియోగించుకుంటున్నామని వెల్లడించారు. ఆల్మట్టి నుంచి జూరాల, తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్ వరకు ఖాళీ జలాశయాలతో ఉన్న కృష్ణాకు ఈ పట్టిసీమ నేడు ఊపిరి పోస్తోందని వివరించారు. పట్టిసీమ కట్టి రూ.1300 కోట్లను నీటిపాల్జేశారని జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కృష్ణాడెల్టా బీడుగా మారి, కరవు కాటకాలతో దుర్భిక్షంగా ఉండాలనేది జగన్ ఆలోచన అని ఎద్దేవా చేశారు. ప్రఖ్యాత ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు 125వ జయంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద మంత్రి నిమ్మల రామానాయుడు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కేఎల్ రావు కుమారుడు విజయ్ రావు, ఇరిగేషన్ సలహాదారులు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడారు. దేశ ఇరిగేషన్ రంగంలో డాక్టర్. కేఎల్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

## రైతుల పంటల మార్కెటింగ్ బాధ్యత ప్రభుత్వాలదే..

- కార్పొరేట్ కంపెనీల లాభాలకు రైతులను బలి చేయడం తగదు.
- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య


**ఏలూరు, జూలై 15 :** రైతుల పంటల మార్కెటింగ్ బాధ్యత ప్రభుత్వాలదేనని, కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం రైతులను బలి చేయవద్దని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు జయప్రదం చేసిన వలంటీర్లకు, కార్యకర్తలకు అభినందన సభ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి.ప్రసాద్ అధ్యక్షతన ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయం హాలులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు ఏలూరులో ఘనంగా నిర్వహించిన ఆహ్వాన సంఘం కమిటీ వారికి, వాలంటీర్స్ గా సేవలు అందించిన వివిధ సంఘాల వారికి, పెద్దలు,ప్రముఖులు, దాతలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదములు తెలియజేశారు. రాష్ట్ర రైతు ఉద్యమానికి ఈ మహాసభలు ఎంతగానో తోడ్పడతాయని చెప్పారు. ఈ రైతు రాష్ట్ర మహాసభల్లో రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఏడు కమిషన్లుగా చర్చించామని,పంటల వారీగా ఆయా పంటల రైతుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చించామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పంటల రైతుల సమస్యలపై, సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై తీర్మానాలు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించామని చెప్పారు. మహాసభలో చేసిన తీర్మానాలు అనుగుణంగా రైతాంగ సమస్యలపై సంబంధిత రాష్ట్ర మంత్రులకు, రాష్ట్ర ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు వివరించారు. రైతులు కష్టపడి పండించిన పంటలు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటల మార్కెటింగ్ అంతా ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో ఉండడం వలన వారి కబంధహస్తాల్లో రైతు నలిగిపోతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలంలో మొక్కజొన్న, కందులు, శనగలు, వర్జీనియా పొగాకు, మామిడి,జీడి మామిడి,పత్తి,కోకో,రొయ్యలు తదితర పంటల రైతులు మార్కెటింగ్ మాయాజాలంతో నష్టపోయారని చెప్పారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకుండా చోద్యం చూశాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలోని రైతులు రోజురోజుకి సంక్షోభంలో కూరుకు పోతున్నారని, ఈ సంక్షోభ కాలంలో రైతును రక్షించుకునేందుకు సమస్యల పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. అసంపూర్ణంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షులు కోన శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, సిఐటియు నాయకులు కె. పోశమ్మ, పంపన రవికుమార్, ఎం.ఇస్సాకు, ప్రజానాట్యమల జిల్లా కార్యదర్శి పి.మంగరాజు, ఐద్వా నాయకురాళ్లు హైమావతి, అరుణ కుమారి, వివిధ సంఘాల నాయకులు సిహెచ్. సుందరయ్య, ముస్తఫా ఆలీ, జి. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ తయారీకి కేంద్రం దన్ను..

## రూ.62,500 కోట్లతో పీఎల్ఐ స్కీమ్



దేశీయంగా మొబైల్ తయారీని ప్రోత్సహించే దిశగా కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.62,500 కోట్లతో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం 2.0కు బుధవారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దీంతో పాటు సెమీకండక్టర్లు, ఎలివేటెడ్ కారిడార్లకు సంబంధించి పలు ప్రాజెక్టులను క్యాబినెట్ ఆమోదించింది. గతంలో మొబైల్ ఫోన్ల కోసం భారత్ ఇతర దేశాల నుంచి వచ్చే దిగుమతులపై ఆధారపడాల్సి వచ్చేది. ఈ క్రమంలోనే దేశీయంగా ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రం పీఎల్ఐ పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా 300 మొబైల్ తయారీ కేంద్రాలతో మన దేశం నుంచే ఫోన్ల ఎగుమతులు జరుగుతున్నాయి. గతేడాది రూ.2.62లక్షల కోట్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను భారత్ ఎగుమతి చేసింది. వీటిలో అత్యధికం యాపిల్ ఫోన్లే. ఇక, దేశీయంగా మొబైల్ ఫోన్ల తయారీ కూడా గతంలో పోలిస్తే రెట్టింపు కావడం గమనార్హం. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.2.14లక్షల కోట్లు విలువైన ఫోన్లు దేశీయంగా తయారవ్వగా.. 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి ఆ మొత్తం రూ.5.5లక్షల కోట్లకు పెరిగింది.






## స్వల్ప లాభాలతో
# ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరుగుదల వంటి ఆందోళనలు ఉన్నా.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం తక్కువగా నమోదైనట్లు గణాంకాలు వెలువడడంతో వడ్డీ రేట్ల పెంపు భయాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. దీనికితోడు హర్మూజ్ జలసంధిపై 20 శాతం సుంకాల డిమాండ్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తీసుకోవడమూ కాస్త కలిసొచ్చింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 130 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 24వేల మార్కును నిలబెట్టుకుంది. సెన్సెక్స్ 130.49 పాయింట్ల లాభంతో 77,185.43 వద్ద ముగిసింది. నిఫ్టీ 26.45 పాయింట్ల లాభంతో 24,078.50వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 96.29గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రా సిమెంట్, ఎటర్నల్, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. పవర్ గ్రిడ్, టాటాస్టీల్, ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 85.55 వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,033 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# ఐసీసీ వన్డే ర్యాంకులు..

## అగ్రస్థానంపై శుభ్‌మన్ గిల్ గురి

ఇంగ్లాండ్‌పై అద్భుత ఇన్నింగ్స్ ఆడిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (80) ఐసీసీ ర్యాంకుల్లోనూ అగ్రస్థానంపై గురి పెట్టాడు. ప్రస్తుతానికి తన ర్యాంకింగ్‌లో మార్పు లేకపోయినా.. రేటింగ్‌లో మాత్రం ముందుకు దూసుకొచ్చాడు. మరోవైపు అతడికి న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోంది. ప్రస్తుతం అతడే 814 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు. శుభ్‌మన్ గిల్ 803 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఒక్క మ్యాచ్‌తో గిల్ ఖాతాలోకి 12 పాయింట్లు వచ్చి చేరాయి. మిగిలిన రెండు మ్యాచుల్లోనూ మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తే గిల్‌కే అగ్రస్థానం దక్కే అవకాశం ఉంది. వీరిద్దరి తర్వాత భారత సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ (757), రోహిత్ శర్మ (744) మూడు, నాలుగు ప్లేసుల్లో కొనసాగుతున్నారు. ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో నిరాశపరిచిన రో-కో.. మిగిలిన మ్యాచుల్లో విఫలమైతే తమ ర్యాంకులకు ప్రమాదం ఎదుర్కోక తప్పదు.

**బౌలర్లలో ఒకే ఒక్కడు..** బౌలర్ల జాబితాలో టీమ్‌ఇండియా నుంచి టాప్ -10లో ఒక్కరికే అవకాశం దక్కింది. అదీనూ ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో చోటు దక్కించుకోలేకపోయిన కుల్‌దీప్ యాదవ్ కావడం గమనార్హం. కుల్‌దీప్ 608 పాయింట్లతో తొమ్మిది నుంచి ఎనిమిదో స్థానానికి పడిపోయాడు. నాలుగు వికెట్లు తీసిన అక్షర్ పటేల్ (503) రెండు స్థానాలను మెరుగుపర్చుకుని 42వ ర్యాంక్‌లోకి వచ్చాడు. ప్రసిద్ధ్ కృష్ణ (471) ఏకంగా 9 స్థానాలను దాటి 49వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. బౌలింగ్ విభాగంలో అగ్రస్థానం రషీద్ ఖాన్ (682)దే.

**ఆల్‌రౌండర్లలో..** అఫ్గానిస్థాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయ్ (316) టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. తాజాగా ఇంగ్లాండ్‌పై హాఫ్ సెంచరీ, నాలుగు వికెట్ల ప్రదర్శన చేసిన అక్షర్ పటేల్ (ూాఇఖుతీ ూఖవశ్రీ)కు టాప్-10లో స్థానం దక్కింది. మూడు స్థానాలు ముందుకొచ్చిన అక్షర్ (213) తొమ్మిదో ర్యాంకులో నిలిచాడు. జట్లపరంగా టీమ్‌ఇండియానే (121) ప్రస్తుతం అగ్రస్థానంలో ఉంది. న్యూజిలాండ్ (110), ఆస్ట్రేలియా (102) తర్వాత స్థానాల్లో నిలిచాయి. భారత్ చేతిలో తొలి వన్డేలో ఓటమిని చవిచూసిన ఇంగ్లాండ్ ఎనిమిదో స్థానానికి పరిమితమైంది.

## సీనియర్ల రాకతో
# బలంగా టీమిండియా జట్టు



ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా ఎట్టకేలకు విజయాన్ని అందుకుంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో చిత్తు చిత్తుగా ఓడిన భారత జట్టు.. తొలి వన్డేలో మాత్రం ఘనవిజయాన్ని అందుకుంది. సీనియర్లు రావడంతో జట్టు బలంగా తయారైంది. మొదట బౌలర్లు ప్రతాపం చూపిస్తే.. ఆ తర్వాత బ్యాటర్లు రెచ్చిపోయారు. ఫలితంగా భారత జట్టు 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు విఫలం అయ్యారు. కోహ్లీ కేవలం 5 పరుగులు చేసి అవుటైతే.. రోహిత్ శర్మ 11 పరుగులు మాత్రమే చేశాడు. అయితే గిల్ (80 రిటైర్డ్ హర్ట్) జట్టుకు విజయాన్ని ఖాయం చేశాడు. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవడానికి ముఖ్య కారణం బౌలర్లు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆరంభంలో మంచి ప్రదర్శన చేసింది. ముఖ్యంగా బెన్ డకెట్ (43) అద్భుతంగా ఆడాడు. తొలి వికెట్‌కు బెతెల్ (14)తో కలిసి 61 పరుగులు జోడించారు. ఈ దశలో ఇంగ్లండ్ 300కు పైగా పరుగులు చేస్తుందని అంతా అనుకున్నారు. అయితే ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. కొత్త బౌలర్ గుర్నూర్ బ్రార్ టీమిండియాకు బ్రేక్ ఇచ్చాడు. బంతిని అందుకున్న అతడు 3 బంతుల వ్యవధిలో 2 వికెట్లు తీశాడు. 13వ ఓవర్ వేసిన బ్రార్.. మొదట జాకబ్ బెతెల్‌ను అవుట్ చేశాడు. అనంతరం డేంజరస్ ప్లేయర్ బెన్ డకెట్‌ను అవుట్ చేశాడు. దాంతో ఇంగ్లండ్ 2 పరుగుల తేడాతో రెండు వికెట్లను కోల్పోయింది. ఇక ఇక్కడి నుంచి భారత జట్టు పుంజుకుంది. ఆ వెంటనే మరో డేంజరస్ ప్లేయర్ హ్యారీ బ్రూక్‌ను బుమ్రా అవుట్ చేశాడు. అంతే ఇంగ్లండ్ వెంటవెంటనే 3 వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత కూడా ఇంగ్లండ్ క్రమం తప్పకుండా వికట్లను కోల్పోయింది. ఒక దశలో 61 పరుగులకు వికెట్ లేకుండా ఉన్న ఇంగ్లండ్.. 46 పరుగుల తేడాతో 6 వికెట్లను కోల్పోయింది. గుర్నూర్ బ్రార్ 9 ఓవర్లలో 2 వికెట్లు తీశాడు. అయితే మ్యాచ్ మధ్యలో కాస్త అతి కూడా చేశాడు. బెన్ డకెట్ నేరుగా కొట్టిన షాట్‌ను అడ్డుకున్న బ్రార్.. బంతిని డకెట్ వైపు విసిరాడు. ఆ తర్వాత బంతిని డకెట్ సిక్సర్ బాదాడు. సోషల్ మీడియాలో.. ఇలాంటి అతి పనులు చేయకు బ్రార్.. నీలో గొప్ప ట్యాలెంట్ ఉందంటూ ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు.




## ఒక్కరోజే రూ.6.7 లక్షల కోట్లు ఆవిరి..
# ఐబీఎంకు ఏమైంది..?

అమెరికా టెక్ దిగ్గజం ఐబీఎం (ఇంటర్నేషనల్ బిజినెస్ మెషీన్స్) షేర్లు ఒక్క రోజే కుప్పకూలాయి. దాదాపు 25 శాతం పతనమయ్యాయి. దీంతో కొన్ని గంటల వ్యవధిలోనే కంపెనీ మార్కెట్ విలువలో దాదాపు 70 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.6.7లక్షల కోట్లకు పైమాటే) మేర సంపద ఆవిరైంది. ఐబీఎం కంపెనీ షేరు విలువ ఒక్క రోజులో ఇంత దారుణంగా పడిపోవడం గత 58 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. త్రైమాసిక ఫలితాలు, ఏఐపై కంపెనీ సీఈఓ చేసిన వ్యాఖ్యలే షేర్ల పతనానికి కారణవ-ుయ్యాయి. మంగళవారం నాటి (అమెరికా కాలమానం ప్రకారం) వాల్‌స్ట్రీట్ ట్రేడింగ్‌లో ఐబీఎం కార్పొరేషన్ షేరు విలువ ఏకంగా 25.21 శాతం కుంగి 217.07 డాలర్లకు పడిపోయింది. దీంతో మార్కెట్ విలువలో దాదాపు 70 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. కంపెనీ షేరు విలువ ఒక రోజు వ్యవధిలో ఈ స్థాయిలో పడిపోవడం 1968 జనవరి 3 తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి గానూ ప్రాథమిక ఫలితాల వివరాలను ఐబీఎం ప్రకటించింది. అనంతరం షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన ఫలితాలను ఐబీఎం వచ్చేవారం విడుదల చేయనుంది. అంతకంటే ముందు తాజాగా ప్రాథమిక వివరాలను వెల్లడించింది. ఈసారి కంపెనీ ఆదాయం అంచనాల కంటే తక్కువగా కేవలం ఒకే ఒక్క శాతం పెరిగి 17.2 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని ఐబీఎం పేర్కొంది. సాఫ్ట్‌వేర్ విభాగ ఆదాయం 5శాతం పెరగొచ్చని, అయితే ఐబీఎం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారం మాత్రం 7శాతం నష్టాలను చవిచూసిందని ప్రకటించింది. ఈ క్రమంలోనే మదుపర్లకు రాసిన లేఖలో ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ కీలక వ్యాఖ్యలు చేశారు. "కృత్రిమ మేధపై దృష్టిపెట్టిన కంపెనీలు.. ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా వెచ్చిస్తున్నాయి. రాబోయే కాలంలో ధరలు పెరుగుతాయన్న ఆందోళనలతో ఈ మధ్య సర్వర్లు, స్టోరేజ్ వ్యవస్థలు, నెట్‌వర్క్ పరికరాలు, మెమొరీ చిప్‌ల కొనుగోళ్లకే ఎక్కువగా మొగ్గుచూపాయి. దీంతో ఐబీఎం ఉత్పత్తులకు గిరాకీ తగ్గింది. ఈ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో మేం విఫలమయ్యాం. వేగంగా స్పందించడంలో తడబడ్డాం. మార్పులను అందిపుచ్చుకోలేకపోయాం. కస్టమర్ల వ్యయ ప్రాధాన్యతలు ఎంత వేగంగా మారుతాయో గ్రహించలేకపోయాం" అని సీఈఓ వెల్లడించారు. ఏఐ తర్వాత కంపెనీలు సైబర్ సెక్యూరిటీపై దృష్టి పెట్టడం కూడా తమ వ్యాపారాన్ని దెబ్బతీసిందని అరవింద్ పేర్కొన్నారు.




# అవును.. నేను సిద్ధమే

## కెప్టెన్సీపై స్మృతి మంధాన ఆసక్తి

భారత మహిళా జట్టుకు వన్డే ప్రపంచ కప్ కలను నెరవేర్చిన సారథి హర్మన్‌ప్రీత్ కౌర్. అయితే, కప్పును సాధించడంలో ఓపెనర్ స్మృతి మంధాన అద్భుత ఆటతీరు కూడా కీలకమే. కానీ, గత టీ20 వరల్డ్ కప్‌లో భారత మహిళా జట్టు గ్రూప్ స్టేజ్‌కే పరిమితమైంది. తాజాగా లార్డ్స్ వేదికగా జరిగిన మొదటి టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ హాఫ్ సెంచరీలు చేసి సత్తా చాటింది. ఈ క్రమంలో 37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ ఆటకు వీడ్కోలు పలికే అవకాశాలు ఎక్కువ ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో తదుపరి టీమ్‌ఇండియా సారథి రేసులో స్మృతి మంధాన ముందు వరుసలో ఉంది. "అవును.. నేను పూర్తిస్థాయి సారథ్యం చేపట్టేందుకు సిద్ధంగానే ఉన్నా" అని మంధాన (ూాఎ-తీఱఅ మీఖఅస్ట్రఖుఅఖు) తెలిపింది. గత పదేళ్లుగా హర్మన్‌తో కలిసి స్మృతి భారత జట్టుకు పిల్లర్‌గా మారింది. డ్యాషింగ్ ఓపెనింగ్‌తో అభిమానులను అలరిస్తోంది. హర్మన్ గైర్హాజరీలో మంధాన ఇప్పటికే 18 టీ20లు, నాలుగు వన్డేల్లో టీమ్‌ఇండియాను నడిపించింది. రెండు ఫార్మాట్లలో కలిపి మొత్తం 15 మ్యాచుల్లో భారత జట్టును గెలిపించింది. "లార్డ్స్ వేదికగా జరిగిన తొలి మహిళా టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. ఈ జట్టులో భాగస్వామ్యం కావడం అద్భుతంగా అనిపిస్తోంది. ఇందులో నా వంతు సహకారం ఉండటం మరింత సంతోషాన్నిస్తోంది. లార్డ్స్‌లో టెస్టు క్రికెట్ అనేది చిన్నప్పటి కల. ఇప్పుడు మేం గెలిచి చూపించాం. ఎప్పటికీ మరిచిపోలేని జ్ఞాపకం" అని స్మృతి మంధాన తెలిపింది.

# కోహ్లీతో కలిసి వరల్డ్‌కప్ 2027 ప్లాన్

## కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కీలక వ్యాఖ్యలు



భారత వన్డే జట్టు భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కీలక వ్యాఖ్యలతో తెరదించారు. ముఖ్యంగా 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు ప్రణాళికలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, అందులో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో కోహ్లీ భవిష్యత్తుపై జరుగుతున్న చర్చలకు కొత్త కోణం లభించింది. ఇంగ్లండ్‌తో తొలి వన్డేకు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో గిల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవలి కాలంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డే కెరీర్‌పై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వీరిద్దరూ 2027లో జరిగే ఐసీసీ వన్డే ప్రపంచకప్ వరకు కొనసాగుతారా లేదా అన్న ప్రశ్నలు తరచూ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గిల్ స్పందిస్తూ, తాను రెండు రోజుల క్రితమే విరాట్ కోహ్లీతో కలిసి 2027 ప్రపంచకప్‌కు సంబంధించిన ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. "మేము జట్టు కాంబినేషన్ గురించి మాట్లాడుకున్నాం. ప్రపంచకప్ జట్టులో ఎవరెవరు ఉండొచ్చు, ప్రస్తుతం జట్టులో లేకపోయినా భవిష్యత్తులో కీలక పాత్ర పోషించే ఆటగాళ్లు ఎవరు, ఏ ఆటగాడిని ఏ స్థానంలో ఆడించడం జట్టుకు ఉపయోగపడుతుంది వంటి అనేక అంశాలపై చర్చించాం" అని గిల్ తెలిపారు. ఈ వ్యాఖ్యలు చూస్తే కోహ్లీని కేవలం సీనియర్ ఆటగాడిగానే కాకుండా, జట్టు వ్యూహాల రూపకల్పనలో భాగస్వామిగా కూడా భారత జట్టు యాజమాన్యం పరిగణిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కొద్ది రోజుల క్రితం విరాట్ కోహ్లీ మాట్లాడుతూ, తాను తన స్థానాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఉన్న జట్టులో కొనసాగాలని అనుకోవడం లేదని వ్యాఖ్యానించారు. అలాంటి సమయంలో గిల్ చేసిన తాజా వ్యాఖ్యలు కోహ్లీపై జట్టు యాజమాన్యానికి ఉన్న విశ్వాసాన్ని మరోసారి తెలియజేశాయి. తన నాయకత్వంలో కూడా కోహ్లీ కీలక పాత్ర పోషిస్తారని గిల్ స్పష్టం చేసినట్లుగా ఈ వ్యాఖ్యలను విశ్లేషకులు భావిస్తున్నారు. కెప్టెన్ పదవి నుంచి తప్పుకున్న తర్వాత టెస్టులు, టీ20ల్లో కోహ్లీ ప్రత్యక్షంగా నాయకత్వ వ్యవహారాల్లో పెద్దగా పాల్గొనలేదు. అయితే ఇప్పుడు 2027 ప్రపంచకప్ ప్రణాళికల్లో ఆయనతో కలిసి వ్యూహాలపై చర్చించడం కొత్త పరిణామంగా భావిస్తున్నారు. ఇది జట్టు నిర్మాణంలో కోహ్లీ అనుభవానికి ఇప్పటికీ ఎంత ప్రాధాన్యం ఉందో తెలియజేస్తోందని క్రికెట్ నిపుణులు అంటున్నారు. వన్డే క్రికెట్‌లో కెప్టెన్‌గా కూడా కోహ్లీ అద్భుతమైన రికార్డు సొంతం చేసుకున్నారు. ఆయన భారత జట్టుకు మొత్తం 95 వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించి 65 విజయాలు అందించారు. 68.42 శాతం విజయశాతంతో ఒకటి కంటే ఎక్కువ వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించిన భారత కెప్టెన్లలో అత్యుత్తమ విజయశాతాన్ని నమోదు చేశారు. ఈ గణాంకాలు కూడా ఆయన నాయకత్వ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వయస్సు గురించి వస్తున్న ప్రశ్నలపైనా గిల్ స్పందించారు. గత పదేళ్లుగా భారత బ్యాటింగ్‌కు ఈ ఇద్దరూ వెన్నెముకగా నిలిచారని కొనియాడారు. వివిధ దేశాల్లో, భిన్నమైన పరిస్థితుల్లో ఎన్నో మ్యాచ్‌లు గెలిపించిన అనుభవం వారికి ఉందని చెప్పారు. వారి అనుభవం, నైపుణ్యం జట్టుకు ఇప్పటికీ ఎంతో విలువైనవని స్పష్టం చేశారు. భారత వన్డే జట్టు భవిష్యత్తు నిర్మాణంలో యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పిస్తూనే, అనుభవజ్ఞులైన కోహ్లీ, రోహిత్‌ల మార్గదర్శకత్వాన్ని కూడా వినియోగించుకోవాలనే ఆలోచనలో జట్టు యాజమాన్యం ఉన్నట్లు గిల్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. 2027 ఐసీసీ వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా భారత జట్టు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తుండగా, కోహ్లీ, రోహిత్ ఇద్దరూ ఆ ప్రణాళికల్లో కీలక భాగస్వాములుగానే కొనసాగుతున్నారని గిల్ వ్యాఖ్యలు స్పష్టం చేశాయి.



# క్రిప్టోపై ఆ వార్తలు అవాస్తవం.. కేంద్రం క్లారిటీ

క్రిప్టో కరెన్సీని నియంత్రించే అంశంపై ఆలోచించాల్సిందిగా ఆర్‌బీఐ, సెబీలను ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించినట్లు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. అవన్నీ అవాస్తవాలని కొట్టిపారేసింది. అలాంటి ప్రతిపాదనలేవీ లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా స్పందించింది. క్రిప్టో కరెన్సీపై ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు జారీకాలేదని కేంద్రం పేర్కొంది. క్రిప్టోను ఒక చట్టబద్ధమైన ఆస్తిగా పరిగణించడం లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వదంతులను నమ్మొద్దని తెలిపింది. విశ్వసనీయం సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లనే సందర్శించాలని సూచించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు కథనాలు వ్యాప్తి జరిగినప్పుడు వెంటనే కేంద్రం దృష్టికి తీసుకురావాలని కోరింది. ఇందుకు o91 8799711259 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని లేదంటే factcheck@pib.gov.in మెయిల్ చేయాలని సూచించింది.



# అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా చేయ-ంబోతున్నారనే వార్తలు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన రాకపోయినా, తాజాగా బసిల్ జోసెఫ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. బసిల్ జోసెఫ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఐకాన్ అని రాసి ఉన్న క్యాప్ ఫొటోను షేర్ చేశారు. ఈ ఒక్క పోస్టే ప్రస్తుతం టాలీవుడ్, మాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 'ఐకాన్' అనేది అల్లు అర్జున్‌కు అభిమానులు పెట్టిన బిరుదు కావడంతో, ఈ పోస్ట్ ఆయనతో చేయ-ంబోయే సినిమాపై పరోక్షంగా ఇచ్చిన హింట్ అని నెటిజన్లు భావిస్తున్నారు. అల్లు అర్జున్, బసిల్ జోసెఫ్ కలిసి సినిమా చేయనున్నారనే ప్రచారం చాలా రోజులుగా సాగుతోంది. ఇటీవల అల్లు శిరీష్ వివాహ వేడుకలో బసిల్ జోసెఫ్ పాల్గొనడం కూడా ఈ ఊహాగానాలకు మరింత బలం ఇచ్చింది. ఇద్దరి మధ్య కథా చర్చలు ఇప్పటికే జరిగినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ప్రాజెక్టును ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. 'మిన్నల్ మురళి'తో సూపర్ హీరో జానర్‌లో తన సత్తా చాటిన బసిల్ జోసెఫ్, 'శక్తిమాన్' కథను అల్లు అర్జున్‌తో తెరకెక్కించ బోతున్నారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఆ వార్తలను దర్శకుడు ఇప్పటికే ఖండించారు. బన్నీతో చేయ-ంబోయేది పూర్తిగా కొత్త కథేనని స్పష్టం చేశారు. కథ వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను అల్లు కుటుంబానికి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిపై పూర్తి స్పష్టత రానప్పటికీ, ప్రాజెక్ట్ దాదాపు ఖరారైనట్లే ప్రచారం సాగుతోంది.ప్రస్తుతం అల్లు అర్జున్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయ్యాక దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో మరో భారీ ప్రాజెక్ట్ చేయనున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాతే బసిల్ జోసెఫ్ దర్శకత్వంలో సినిమా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం, అట్లీ సినిమా బన్నీ కెరీర్‌లో 22వ చిత్రం కాగా, లోకేష్ మూవీ 23వ చిత్రంగా రానుంది. బసిల్ జోసెఫ్ ప్రాజెక్ట్‌ను అల్లు అర్జున్ తన 25వ చిత్రంగా ఎ÷-లాన్ చేస్తున్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది.

# 23న జననాయగన్ విడుదలకు రెడీ

తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ అభిమానులకు శుభవార్త. ఆయన కీలక పాత్రలో నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' విడుదల తేదీ ఖరారైంది. జులై 23న ఈ మూవీ విడుదల చేయనున్నట్లు ఓ టికెట్ బుకింగ్ యాప్ ప్రకటించింది. 24న విడుదలవుతుందని తొలుత ప్రకటించారు. కానీ ఒకరోజు ముందే వస్తోంది. దీంతో సామాజిక మాధ్యమాల వేదికగా విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ మూవీ సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఈ మధ్యలో కోర్టు కేసులు, విచారణలు, సీబీఎఫ్‌సీపునః పరిశీలన తర్వాత ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్‌ను సెన్సార్ బోర్డు జారీ చేసింది. దాదాపు 183 నిమిషాల నిడివితో 'జన నాయగన్' ప్రేక్షకుల ముందుకు రానుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో ముస్తాబైన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలక పాత్ర పోషించింది.





# 14 నెలలుగా వారణాసి కోసం పనిచేస్తున్నాను : ప్రియాంక చోప్రా

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయి-ంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె ఈ సినిమా గురించి మాట్లాడారు. "నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చా లా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేను" అని తెలి పారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.



# ప్రభాస్ అంటే.. మంచి భోజనం గుర్తుకొస్తుంది

## హీరోయిన్ పూజా హెగ్డే ఆసక్తికర వ్యాఖ్య

స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తాజాగా ప్రభాస్ గురించి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్‌తో కలిసి రాధేశ్యామ్ సినిమాలో నటించిన రోజులను గుర్తు చేసు కుంటూ ప్రభాస్ వ్యక్తిత్వం, ఆయన ఆతిథ్యం గురించి ఆమె చేసి న వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. 'ప్రభాస్ పేరు చెప్పగానే నాకు ముందుగా గుర్తొచ్చేది భోజనమే అని ఆయన భోజనాన్ని దొంగిలించాలనిపిస్తుందన్నారు. రాధేశ్యామ్ షూటింగ్ సమయంలో ఆయన పంపించే ఫుడ్ డబ్బా కోసం అందరం ఎదురు చూసేవారని.. నాకు కూడా ప్రతిరోజూ ఎంతో రుచికరమైన వంటకాలు పంపించేవారు' అని చెప్పారు. అదే విషయాన్ని మరోసారి ప్రస్తావించడంతో ప్రభాస్ అభిమానులు రాజు ఎక్కడ ఉన్నా రాజేరా అంటూ ఈ వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.



# వంటలతో సమంత కాలక్షేపం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకుంటున్న మార్పులు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఒకప్పుడు తనకు వంట చేయడం పెద్దగా రాదని, కిచెన్‌లో గడపడం కంటే షూటింగ్‌లు, కెరీర్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టేదానినని చెప్పిన సమంత.. ఇప్పుడు పూర్తిగా మారినట్టు కనిపిస్తుంది. ప్రస్తుతం ఆమె రాయల సీమ సంప్రదాయ వంటకాలను నేర్చుకోవడంలో ఆసక్తి చూపుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సమంత సన్నిహితుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం ఆమె ఇంట్లోనే ఎక్కువ సమయం గడుపుతూ రాయలసీమ ప్రత్యేక వంటకాలను నేర్చుకుంటున్నారట. ఘాటు రుచులు, ప్రత్యేకమైన మసాలాలు, సంప్రదాయ తయారీ విధానాలతో ప్రసిద్ధి చెందిన సీమ వంటలను ఎంతో ఆసక్తిగా నేర్చుకుంటూ, స్వయంగా తయారు చేసి రుచి చూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె ప్రశాంతమైన కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తూ, ఇంటి వాతావరణంలో ఎక్కువ సమయం గడుపుతున్నారు. దీంతో గతంలో చేయలేకపోయిన ఎన్నో విషయాలను ఇప్పుడు ఆసక్తిగా నేర్చుకుంటున్నారని సమాచారం. ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న సమంత బయట కార్యక్రమాలను తగ్గించి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విరామ సమయంలో వంటపై దృష్టి పెట్టడం ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఆరోగ్యకరమైన, ఇంట్లో తయారైన ఆహారం ఈ సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తూ, పోషకాహారంతో కూడిన సంప్రదాయ వంటకాలను నేర్చుకుంటున్నారని సన్నిహితులు చెబుతున్నారు. తెలుగు కుటుంబంలో కొత్త జీవితాన్ని ప్రారంభించిన తర్వాత తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, స్థానిక వంటకాలపై సమంతకు మరింత ఆసక్తి పెరిగిందని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## మధ్య తరగతి జీవితాల కష్టాలు..

# మిస్టర్ మిడిల్ క్లాస్

ఎంత ధనవంతులైనా ఏదో ఒక సందర్భంలో మధ్య తరగతి జీవితాన్ని అనుభవించినవారే. ఆ జీవితాల వెనకుండే కష్టాల్ని వినోదాత్మకంగా తెరపైకి తీసుకు రావడం ఓ గొప్ప కళ అన్నారు నటుడు శ్రీకాంత్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిస్టర్ మిడిల్‌క్లాస్'. లయ కథానాయిక. జి.నాగేశ్వర్ రెడ్డి దర్శకుడు. జీకే, సీఎన్ నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. సినీ ప్రముఖులు వి.వి.వినాయక్, దశరథ్, కోన వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకని ఉద్దేశించి శ్రీకాంత్ మాట్లాడుతూ 'వేంకటేశ్వర స్వామి పాత్ర లేకపోతే ఈ సినిమానే లేదు. అలాంటి గొప్ప పాత్రని రాజేంద్రప్రసాద్ చేశారు. ఈ సినిమా ప్రయాణం నా పాత రోజుల్ని గుర్తు చేసింది' అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'ఇలాంటి గొప్ప పాత్ర చేసే అవకాశం రావడం నా అదృష్టం. శ్రీకాంత్‌తో 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి' మొదలుకొని పలు విజయవంతమైన సినిమాలు చేశా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'శ్రీకాంత్‌తో సినిమా చేయడం నాకు ఎప్పుడూ హాయిగా ఉంటుంది. రాజేంద్రప్రసాద్ ఈ సినిమాకి వెన్నెముకలా నిలిచారు' అన్నారు. ఈ కార్యక్రమంలో నటులు అలీ, ధనరాజ్, పృథ్వీరాజ్, ఛాయాగ్రాహకుడు అంజి, సంగీత దర్శకుడు సాయికార్తీక్‌తో పాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.



PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083..EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com